# మంత్రి జూపల్లి కోసం కుర్చీ వేసి చూస్తున్నా: కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రి జూపల్లి కోసం తెలంగాణభవన్‌లో కుర్చీ వేసి వేచి చూస్తున్నానని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. శాలువాతో సిద్ధంగా ఉన్నా.. ఆయన రాలేదన్నారు. అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న జూపల్లి ఎటువెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. " గన్‌పార్క్ వద్దకు చర్చకు రావడానికి నేను కూడా సిద్ధం. మేం అక్కడికి వెళ్తామంటే అరెస్టు చేస్తున్నారు. ఇక్కడ వేచి ఉంటేనే కాంగ్రెస్ నేతలు తోక ముడిచారు. అక్కడ కూర్చొని తొడలు కొడితే ప్రయోజనం ఏంటి?మంత్రి పొంగులేటి మీద జరిగిన ఈడీ విచారణ ఏమైందో బండి సంజయ్ చెప్పాలి. రాష్ట్రంలో ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ చెప్పారు. మోదీ చెప్పినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదు. అమృత్ టెండర్లలో అవినీతిపై ఎందుకు విచారణ జరపలేదో సమాధానం చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# డివైడర్‌పై యువకుడి బైక్ రైడ్.. సజ్జనర్ ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా కొందరు మారడం లేదు. నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో కనీస రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించకుండా డివైడర్‌పై ద్విచక్రవాహనం నడుపుతున్న ఓ యువకుడి వీడియోను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు వాహనదారులకు విలువైన సూచనలు చేశారు. "హెల్మెట్ లేదు, ట్రాఫిక్ నిబంధనలపై గౌరవం లేదు.. కేవలం డేర్ డెవిల్ విన్యాసాలు మాత్రమే! డివైడర్లు రోడ్లను విభజించడానికి ఏర్పాటు చేసినవి తప్ప మీ ద్విచక్రవాహనాలు ర్యాంప్ వాక్ చేసేందుకు కాదు. కొద్ది నిమిషాల సమయం ఆదా చేసేందుకు ప్రాణాలను పణంగా పెట్టకండి. ఇలాంటి సాహసాలు మిమ్మల్ని గమ్యస్థానాలకు కాదు.. నేరుగా యమపురికో లేదా ఆస్పత్రి బెడ్‌కో చేరుస్తాయి. రహదారి భద్రత- ప్రతి ఒక్కరి బాధ్యత" అని సజ్జనర్ తన పోస్టులో పేర్కొన్నారు.




-4లో

# నాడు ప్రభుత్వ భూమి..! నేడు ప్రైవేటు భూమిగా..?

- 2023 మార్చిలో అక్రమ రోడ్డుగా నిర్ధారించి కూల్చేసిన రెవెన్యూ అధికారులు..
- 2026 "జూన్-జూలై"లో సర్వేతో సక్రమం అయిందట..!
- రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూమి పట్ల అధికారుల నిర్లక్ష్య ధోరణిపై విమర్శలు..
- దుండిగల్ రెవెన్యూ అధికారులు ఎవరికి తోచినట్లు వారు వ్యవహరిస్తున్న వైనం..
- బహదూర్‌పల్లి సర్వే నెంబర్ 131 ప్రభుత్వ భూ వివాదంలో సర్వేల మాయాజాలం..!
- రెవెన్యూ శాఖ పనితీరుపై తీవ్ర అనుమానాలు వ్యక్తం..
- పాత సర్వేలో తప్పులు ఉన్నాయని ప్రస్తుత తహశీల్దార్ వ్యాఖ్య..?
- వాస్తవాలపై ఏడీ సర్వే చేయాలని స్థానికుల డిమాండ్..!

# "గో టు విలేజ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..!

## -ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల పిలుపు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూలై 2:** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "గో టు విలేజ్" కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి తిప్పరపు లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశపాగ రాంచందర్ మాదిగ హాజరయ్యారు.. సమావేశంలో ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సిల్వేరు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించిన అవకాశాలను మాదిగ యువత సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో ప్రజలకు వర్గీకరణ ఫలాలపై అవగాహన కల్పిస్తూ "గో టు విలేజ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.. అదేవిధంగా జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని, మహాజన నాయకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరి మాదిగ, మాదిగ యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసురం రమేష్, మాదిగ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నడిమిదొడ్డి సలోమి, మహాజన



సోషలిస్టు పార్టీ నాయకురాలు ఆరెకటిక జ్యోతి, బాచుపల్లి మండల అధ్యక్షుడు ఏసన్న మాదిగ, విజయ్ మాదిగ, ఎర్రోళ్ల రామకృష్ణ మాదిగ, రాజేందర్ పిల్లె, మాదిగ విద్యార్థినులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కడుపు చల్లగా...

### ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం

### టీచర్లు, లెక్చరర్లకూ భోజనం

### తెలంగాణ అల్పాహార పథకానికి మంత్రి మండలి ఆమోదం



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో పూర్వప్రాథమిక విద్య నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులందరికీ ఉదయం అల్పాహారాన్ని అందించే తెలంగాణ అల్పాహార పథకానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం అమలవుతుండగా ఇకపై ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందజేస్తారు. మధ్యాహ్న భోజనం కూడా ఉంటుంది. మధ్యాహ్న భోజనం పథకాన్ని విద్యార్థులతో పాటు అక్కడే పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లకూ విస్తరించింది. 2026-27 విద్యాసంవత్సరం నుంచి అమలు చేయడానికి పాఠశాల విద్యాశాఖ రూ.733.46 కోట్లు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టరేట్ రూ.191.95 కోట్లు కలిపి మొత్తం రూ.925.41 కోట్లు ఖర్చు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పాఠశాలల్లో పూర్వప్రాథమిక విద్య నుంచి ఐదోతరగతి విద్యార్థులకు 75 గ్రాములు.. 6 నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు 100 గ్రాముల చొప్పున అల్పాహారం అందించనుంది.

**పాఠశాల విద్యార్థులకు ఇలా...**

ఒక విద్యాసంవత్సరంలో 230 రోజులు అల్పాహారం, 115 రోజులు పాలు ఇస్తారు.

పూర్వప్రాథమిక విద్య నుంచి ఐదోతరగతి వరకు చదివే 9,24,124 మంది విద్యార్థులకు అల్పాహారం కోసం రోజుకి ఒక్కో విద్యార్థికి రూ.11.50 చొప్పున ఆ విద్యాసంవత్సరానికి రూ.244.43 కోట్లు వెచ్చిస్తారు.

ఆరు నుంచి పదోతరగతి చదివే 9,11,233 మంది, మోడల్ స్కూళ్లలో ఇంటర్ చదివే 22,559 మంది విద్యార్థులకు అల్పాహారం కోసం రోజుకి రూ.13.50 చొప్పున రూ.289.63 కోట్లు ఖర్చు చేస్తారు.

పాఠశాలల్లో ప్రాథమిక నుంచి పదోతరగతి, మోడల్ స్కూళ్లలో ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు కాచిన పాలు ఇచ్చేందుకు రూ.199.4 కోట్లు వెచ్చిస్తారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పోలీసుల వేషంలో దోపిడీ.. బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తామని ఆశ చూపి..



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్లాక్‌మనీని వైట్‌గా మారుస్తామని అమాయకులకు ఆశ చూపించి.. అనంతరం పోలీసుల వేషంలో బెదిరించి నగదు దోచుకున్న ముఠాను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో 14 మంది నిందితుల్లో 12 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఫౌరేబి తెలిపారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. నిందితుల్లో ఓ కానిస్టేబుల్, ఆర్ఎస్సై కూడా ఉన్నట్లు తెలిపారు.

ఏసీపీ కథనం ప్రకారం.. గత నెల 25న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కుర్రా గంగాధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పట్టణ సీఐ టి. శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గంగారం శివారులో నిర్వహిస్తున్న తనిఖీల్లో 12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం తెలిసింది. దర్యాప్తులో ఏలూరు జిల్లా వెంకటాపురానికి చెందిన ఈద చంటిబాబు ఈ ముఠా సూత్రధారిగా గుర్తించారు. అతడు మరో 13 మందితో కలిసి వివిధ సిమ్‌కార్డుల ద్వారా అమాయకులకు ఫోన్ చేసి, తాము రియల్ ఎస్టేట్ వ్యాపారులమని.. తమ వద్ద ఉన్న బ్లాక్‌మనీని వైట్‌మనీగా మార్చుకోవాల్సి ఉందని నమ్మించేవారు.

**నిందితుల్లో కానిస్టేబుల్, ఆర్ఎస్సై..**

రూ.10 లక్షలు ఇస్తే రూ.40 లక్షలు ఖాతాలో జమ చేస్తామని ఆశ చూపించి బాధితులను నిర్ణయించిన ప్రాంతానికి రప్పించేవారు. బాధితులు నగదు తీసుకొచ్చిన తర్వాత డమ్మీ కరెన్సీ నింపిన బ్యాగును ఇచ్చేవారు. అదే సమయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ముఠాలోని కొందరు నిజమైన పోలీసులు.. నకిలీ పోలీసులతో అక్కడికి చేరుకుని దాడి చేసేవారు. నకిలీ కరెన్సీ వ్యాపారం చేస్తున్నారంటూ బెదిరించి బాధితుల వద్ద ఉన్న నగదును లాక్కొని పరారయ్యేవారు. ఇదే తరహాలో పలు ప్రాంతాల్లో మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో టీజీఎస్పీ 15వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ ముళ్లగిరి వర్ధన్, ఆర్ఎస్సై బైరా కేశవరావు ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని ఏసీపీ తెలిపారు.



2023 మార్చి నెలలో రోడ్డు పనులను అడ్డుకున్న దుండిగల్ రెవెన్యూ.. హెచ్చరిక బోర్డు.. (ఫైల్‌ఫోటో)



తాజాగా గత నెల రోజులుగా మళ్ళీ రోడ్డు పనులు.. ఇప్పుడు సక్రమం అయిందట.. (ప్రస్తుత ఫొటో)

# నాడు ప్రభుత్వ భూమి..!

# నేడు ప్రైవేటు భూమిగా..?

దుండిగల్ గండిమైసమ్మ మండలంలో విధుల్లో ఉన్న అధికారులు ఎవరి హయాంలో వాళ్ళు, దోచుకోవడమే పరమావధిగా పెట్టుకున్నారని, బహుదూర్‌పల్లి సర్వే నెం.131 ప్రభుత్వ భూమి వ్యవహారంలో బట్టబయలు అయింది.. మరోరకంగా చెప్పాలంటే, సంబంధిత అధికార యంత్రాంగం ఒక ప్యానెల్‌గా ఏర్పడి, ఏకథాటిగా ఈ అక్రమాలకు పాల్పడుతూ, ప్రభుత్వ ఆస్తులకు ఎసరు పెడుతున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అందుకు నిదర్శనమే ఈ రోడ్డు నిర్మాణం..? 2023లో స్వయంగా దుండిగల్ రెవెన్యూ అధికారులే అడ్డుకుని చర్యలు చేపట్టారు.. అదే స్థలం ఇప్పుడు తాజా సర్వేలతో ప్రైవేటు భూమిగా, తేల్చినట్టు సమాచారం.. ఇక్కడ అర్థం కాని ప్రశ్నలు ఏమిటంటే..? గతంలో తప్పుడు సర్వే అయితే సంబంధిత సర్వేయర్‌ను సస్పెండ్ చేయండి.. ప్రస్తుతం తప్పుడు సర్వేగా భావిస్తే ఇప్పటి సర్వేయర్‌ను సస్పెండ్ చేయండి.. అంతేగాని బదిలీపై వెళ్ళిన అధికారులపై నోటి మాటలతో ఆరోపణలు చేయడం సరైనది కాదని, ఉన్నతాధికారులకు లేఖ పూర్వకంగా ఫిర్యాదు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.. అది తప్పుడు సర్వే.. ఇదే సరైన సర్వే అంటూ సమాధానం ఇస్తే తప్పు ఒప్పు అవుతుందా..? ఈ వ్యవహారంపై స్థానికులు తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 2:**




- 2023 మార్చిలో అక్రమ రోడ్డుగా నిర్ధారించి కూల్చేసిన రెవెన్యూ అధికారులు..
- 2026 "జూన్-జూలై"లో సర్వేతో సక్రమం అయిందట..!
- రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూమి పట్ల అధికారుల నిర్లక్ష్య ధోరణిపై విమర్శలు..
- దుండిగల్ రెవెన్యూ అధికారులు ఎవరికి తోచినట్లు వారు వ్యవహరిస్తున్న వైనం..
- బహదూర్‌పల్లి సర్వే నెంబర్ 131 ప్రభుత్వ భూ వివాదంలో సర్వేల మాయాజాలం..!
- రెవెన్యూ శాఖ పనితీరుపై తీవ్ర అనుమానాలు వ్యక్తం..
- పాత సర్వేలో తప్పులు ఉన్నాయని ప్రస్తుత తహశీల్దార్ వ్యాఖ్య..?
- వాస్తవాలపై ఏడీ సర్వే చేయాలని స్థానికుల డిమాండ్..!










2023 నాటి రెవెన్యూ చర్యలపై "పెన్ పవర్" దినపత్రికలో వచ్చిన కథనాలు..

దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి మరో విషయంలోనూ దృష్టి సారించాలి.. గత సర్వేయర్ శ్రీనివాసాచారి ఘనకార్యం బహుదూర్‌పల్లి ప్రైమార్క్ నిర్మాణ సంస్థకు జారీచేసిన తప్పుడు స్కెచ్ మ్యాప్‌తో విలేజ్ మ్యాప్‌లో ఉన్న చెరువు నాలాను చూపించక పోవడం పెను ప్రమాదంగా తయారైందని స్థానికులు హైకోర్టును కూడా ఆశ్రయించారు.. చివరికి సర్వేయర్ తప్పును, మరో సర్వేయర్ గుర్తించేలోపే.. 17 గుంటల నాలా స్థలం (2000 గజాలపై) ప్రైమార్క్ నిర్మాణ సంస్థ ఎ-బ్లాక్ టవర్ నిర్మాణం పూర్తయింది.. అస రెవెన్యూ సర్వేయర్ చేసిన ఒక పొరపాటును సమర్థించడానికి "తిలాపాపం తలాపిడికెడు" అన్నట్టు మరో మూడు శాఖలు తప్పుడు నివేదికలు తయారు చేయాల్సి వచ్చింది.. చివరికి బహుదూర్‌పల్లి చెరువు నాలా కనుమరుగైంది.. ఇప్పటికీ ప్రైమార్క్ టవర్ కింద బాబాఖాన్ లేక్‌ఐడి నెంబర్ 2859 చెరువు నాలా 17 గుంటల స్థలం కబ్జాలోనే ఉంది.. ఈ ఘనకార్యానికి సూత్రదారి గ్రేట్ సర్వేయర్ శ్రీనివాసాచారి..




అప్పుడు (2023లో) రెవెన్యూ కూల్చివేతలు..ఫైల్‌ఫోటో..



ఇప్పుడు అదే చోట దర్జాగా రోడ్డు పనులు.. తాజా ఫోటో..

## సర్వేయర్ శ్రీనివాసాచారి తప్పుడు సర్వే: తహశీల్దార్..


ఈ విషయాన్ని దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డితో ప్రస్తావించగా, ఆయన స్పందించారు.. గతంలో జరిగిన సర్వే పూర్తిగా తప్పుల తడకగా ఉందని పేర్కొన్నారు.. అందుకే, టిప్పన్ ఆధారంగా, ఈసారి సర్వే నిర్వహణలో జాగ్రత్త వహించినట్టు తెలిపారు.. గత సర్వేయర్ శ్రీనివాసాచారి నివేదికల్లో లోపాలు ఉన్నాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు. తుది నిర్ణయం ఉన్నతాధికారులే నిర్ధారిస్తారని అన్నారు.. ఇదిలా ఉండగా, తాజా సర్వే నివేదిక పూర్తిగా బయటకు రాకముందే 2023లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ భూమి హెచ్చరిక బోర్డులు తొలగించడం,పలు అనుమానాలకు తావిస్తోంది..

మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం బహదూర్‌పల్లిలోని సర్వే నెంబర్ 131 ప్రభుత్వ భూమికి సంబంధించిన సర్వే వివాదం రెవెన్యూ శాఖ పనితీరు విమర్శల పాలవుతోంది.. ఎవరు విధుల్లో ఉంటే.. వాళ్ళదే సరైన సర్వేలుగా నిర్ధారిస్తూ, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టంలో అధికారులే కీలకపాత్ర పోషిస్తున్నట్టు స్పష్టమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. అధికారుల ముసుగులో అక్రమార్కులను మించిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. 2023 వరకు ప్రభుత్వ రికార్డులు, అప్పటి సర్వే నివేదికల ప్రకారం ప్రభుత్వ భూమిగా నమోదైన సర్వే నంబర్-131లోని భూమి ప్రస్తుతం ప్రైవేటు భూమిగా ఎలా నమోదయిందని ప్రశ్నిస్తున్నారు.. ఒకే భూమికి సంబంధించి రెండు భిన్నమైన సర్వే నివేదికలు ఉండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..2023లో అప్పటి తహశీల్దార్ ఆదేశాల మేరకు సర్వేయర్ శ్రీనివాసాచారి నిర్వహించిన సర్వేలో సర్వే నంబర్--131 ప్రభుత్వ భూమిగా నిర్ధారించి హద్దులు నిర్ణయించారు. అనంతరం అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భారతి ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, ఆ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన కంటైనర్‌ను తొలగించారు.. మళ్ళీ రోడ్డు పనులకు అవకాశం ఇవ్వకుండా  కందకం తవ్వించారు.. అయితే తాజాగా గత కొద్ది రోజులుగా అదే భూమిపై మరోసారి సర్వే నిర్వహించిన అధికారులు సర్వే నంబర్-131 ప్రభుత్వ భూమిని, సర్వే నంబర్--133 లో భాగంగా చూపుతూ కొత్త స్కెచ్ మ్యాప్ సిద్ధం చేసినట్లు సమాచారం.. రూ. కోట్లు విలువైన ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే అవకాశం ఉందని, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు..స్థానికులు చెపుతున్న ప్రకారం సర్వే నంబర్--133లో ఉన్న రెండు ఎకరాల ప్రైవేటు భూమికి చేరుకోవాలంటే ప్రభుత్వ సర్వే నంబర్-131 మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూమి హద్దులు మార్పు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు..

# హైదరాబాద్‌లో కిడ్నాప్ గ్యాంగ్ కలకలం.. లింగంపల్లిలో మరో చిన్నారి కిడ్నాప్

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లలో కిడ్నాప్ గ్యాంగ్స్ కలకలం రేపుతున్నాయి. పదిహేను రోజుల క్రితం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 3ఏళ్ల బాలుడిని కిడ్నాప్ చేయగా నేడు నిందితుడిని పట్టుకుని తల్లికి అప్పగించారు. ఈ ఘటన మర్చిపోకముందే లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో మరో చిన్నారి కిడ్నాప్ జరిగింది. నిద్రిస్తున్న తల్లి నుండి నెలల వయసు ఉన్న శిశువును మాయం చేశారు. శిశువును కిడ్నాప్ చేసి ఆటోలో తీసుకెళ్లినట్టు సీసీ టీవీ కెమెరాలో రికార్డ్ అయ్యింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరపుతున్నారు. ఇక సరగ్గా పదిహేను రోజుల క్రితం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో మూడేళ్ల నిఖిల్ అనే బాలుడు కిడ్నాప్ కు గురయ్యాడు. అమ్మమ్మతో స్టేషన్ కు వెళ్లిన నిఖిల్ ను ఓ కిడ్నాపర్ ఎత్తుకెళ్లాడు. బాలుడి చేతిని అమ్మమ్మ తన కొంగుతో కట్టేసినప్పటికీ ఆమె నిద్రిస్తున్న
సమయంలో నిందితుడు కిడ్నాప్ చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పదిహేను రోజుల తరవాత నిందితుడిని జీడిమెట్లలోని ఓ లాడ్జిలో గుర్తించారు. నిందితున్ని అరెస్ట్ చేసి బాలుడిని తల్లికి అప్పగించారు. ఈ ఘటన మర్చిపోకముందే లింగపల్లి రైల్వే స్టేషన్ లో చిన్నారి మాయం అవ్వడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో నగరంలోని రైల్వే స్టేషన్ లలో కిడ్నాప్ గ్యాంగ్ లు సంచరిస్తున్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.






# ఆర్ఎఫ్సీఎల్‌లో 94,849 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి




**హైదరాబాద్ పెన్ పవర్:** రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్) జూన్–2026 నెలలో 94,849 మెట్రిక్ టన్నుల వేపపూత (నీమ్ కోటెడ్) యూరియాను ఉత్పత్తి చేసినట్లు యూనిట్ హెడ్ ఎస్.కె. జిందాల్ గురువారం తెలిపారు. జూన్ నెలలో ఉత్పత్తి చేసిన యూరియాతో పాటు మొత్తం 97,094.70 మెట్రిక్ టన్నుల యూరియాను వివిధ రాష్ట్రాలకు సరఫరా చేసినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణకు అత్యధికంగా 48,675.33 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 11,308.23 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 28,338.66 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 5,655.60 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 3,116.88 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు వివరించారు. ఆర్ఎఫ్సీఎల్ అనేది నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్), ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్), ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎఫ్సీఐఎల్) సంయుక్త భాగస్వామ్య సంస్థ అని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ సంస్థలో ఈక్విటీ భాగస్వామిగా ఉందన్నారు. 2021 మార్చి 22న వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించిన రామగుండం యూనిట్ ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు నాణ్యమైన వేపపూత యూరియాను సరఫరా చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్.కె జిందాల్ మాట్లాడుతూ.. జూన్ నెలలో ఉత్పత్తి, సరఫరా లక్ష్యాలను విజయవంతంగా సాధించడంలో కృషి చేసిన కార్మికులు, ఉద్యోగులు, అధికారులను అభినందించారు. అలాగే కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అందించిన సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ముగిసిన తెలంగాణ 'ఈ కేబినెట్' భేటీ.. మూసీ ప్రాజెక్టు ఫేజ్-1కు ఆమోదం




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సచివాలయం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన దాదాపు 3 గంటల పాటు కొనసాగిన 'ఈ కేబినెట్' భేటీ ముగిసింది. ఈ సమావేశంలో ప్రధానంగా విద్యాశాఖ, సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలకమైన అంశాలపై మంత్రి మండలి విస్తృతంగా చర్చించి, కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముందుగా విద్యా రంగానికి సంబంధించి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఇకపై విద్యార్థులతో పాటు విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, లెక్చరర్లు, బోధనేతర (నాన్–టీచింగ్) సిబ్బంది అందరికీ కూడా ఉచితంగా అల్పాహారం మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

**రాష్ట్రంలో 'వీబీజీ రామ్‌జీ' పథకం అమలు..**

ఇక కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వీబీజీ రామ్‌జీ' పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. అయితే, ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న కొన్ని అభ్యంతరాలపై దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఆశ్రయించాలని, దీనిపై న్యాయ పోరాటం చేయాలని కేబినెట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన సిఫార్సులకు ఆమోద ముద్ర వేసింది. ఇక హైదరాబాద్ నగర పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్ట తలపెట్టిన 'మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు' (వీబంఊ =అజవతీటతీశత్ ణవజవశ్రీశీజూఎవత్ ౯ాతీశీయవమ్) ఫేజ్–1 పనులకు కేబినెట్ అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా మూసీ పరివాహక ప్రాంతాల అభివృద్ధి, సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది.

**'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్'కు ఆమోదం..**

అదేవిధంగా టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మొత్తం 6,278 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపినట్లుగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపారు. నగరంలో కేంద్ర రక్షణ శాఖ భూములు ఇచ్చేందుకు అంగీకరించిన తరుణంలో 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్'కు కేబినెట్ ఆమోదం ముద్ర వేసిందని తెలిపారు. ఇక 21 కి.మీ మేర మూసీ సుందరీకరణకు ఆమోదం తెలిపామని.. ఇందులో ఫేజ్–1 పనులకు గాను రూ.7,345 కోట్ల నిధులు కేటాయించాలని నిర్ణయించామని వెల్లడించారు. రాష్ట్రంలోని గోదాములు, విద్యాలయాలు, సంస్థల నిర్మాణం కోసం స్థలాల కేటాయింపు, 12వ తరగతి వరకు విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు, మధ్యహ్న భోజనం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు.

# అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్ పెన్ పవర్:** తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, తాము అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలి, తాను చెప్పింది అబద్ధమైతే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కార్పొరేషన్ పేరుతో అప్పు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారని, ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి రూ.20 లక్షలు వసూలు చేస్తారా? అని ప్రశ్నించారు. అప్పులపై చర్చకు సిద్ధమని, తాను తెలంగాణ భవన్ ని కూడా వస్తానని మంత్రి జూపల్లి చేసిన సవాల్ నేపథ్యంలో గురువారం జూపల్లి ఏం చేస్తారన్న ఉత్కంఠ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆయన గాంధీభవన్ లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని అనంతరం గన్ పార్క్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గరకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ అప్పులపై చర్చకు సిద్ధం అని, సవాల్ కు కట్టుబడి గన్ పార్క్ దగ్గరకు వచ్చానని, బీఆర్ఎస్ పార్టీ వాళ్లు ఎవరూ రాలేదని మంత్రి జూపల్లి విమర్శించారు.
గాంధీభవన్ కు వెళుతున్న సమయంలో గన్ పార్క్ దగ్గరకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్నట్లు సమాచారం ఉండటంతో నేరుగా గన్ పార్క్ దగ్గరకే వచ్చానని, బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎవరు వచ్చినా అప్పులపై ఇక్కడే చర్చించుకుందాం అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. బావ, బామ్మర్ది ఇద్దరూ కలిసి రండి అని మంత్రి జూపల్లి తెలిపారు. బావ ఒకచోట, బామ్మర్ది మరోచోట మాట్లాడటం ఎందుకు? మీ ఇద్దరికీ ఒకేసారి ఇక్కడే సమాధానం ఇస్తానని ఆయన సవాల్ విసిరారు. తాము చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదు? తన వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తా, చర్చకు రావాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నామని మంత్రి జూపల్లి చెప్పారు.

**బీఆర్ఎస్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల ఆర్థిక భారం : మంత్రి జూపల్లి**

బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలన ముగిసే నాటికి తెలంగాణ రాష్ట్రంపై అప్పులు, పెండింగ్ బిల్లులు కలిపి మొత్తం రూ.8,21,651 కోట్ల ఆర్థిక భారం మిగిలిందని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తాము చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమని ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు సమాధానంగా గన్ పార్కు అమరవీరుల స్థూపం సాక్షిగా ఆయన ఈ లెక్కలను మీడియా ముందు ఉంచుతున్నట్లుగా ఆయన తెలిపారు. 2014 జూన్ 2న రాష్ట్ర ఏర్పాటు సమయంలో మొత్తం బకాయిలు రూ.90,161 కోట్లు మాత్రమే ఉండగా, 2023 డిసెంబర్ 1 నాటికి అవి భారీగా పెరిగాయని వివరించారు. మొత్తంగా అప్పులు, పెండింగ్ బిల్లులు కలిపి రాష్ట్రంపై రూ.8,21,651 కోట్ల ఆర్థిక భారం మిగిలిందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్ష నేతలు వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన సవాల్ విసిరారు. తాను మాటకు కట్టుబడి ఉన్నానని, కేటీఆర్, తన లెక్కలు తప్పని కేసీఆర్ తో చెప్పించాలని, 2.06.2014 నాటికి ఉన్న అప్పులు మొత్తం రూ. 90,161 కోట్లు, 1.12.2023 నాటికి ఉన్న అప్పుల మొత్తం రూ. 8,21,651 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నా

# డ్రగ్స్, మద్యం మత్తులో డ్రైవింగ్‌కు చెక్.. డీజీపీకి బీఆర్ఆర్ ఫౌండేషన్ వినతి




**ఇబ్రహీంపట్నం పెన్ పవర్:** డ్రగ్స్, మద్యం మత్తులో వాహనాలు నడిపేవారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసి బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. మద్యం మత్తు, డ్రగ్స్, గంజాయి, నిద్రమత్తు వంటి ప్రభావంలో వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరీక్షా కిట్లను వినియోగించి అనుమానిత వాహనదారులకు పరీక్షలు నిర్వహించి, పాజిటివ్‌గా తేలిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
అదేవిధంగా యువత ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు బీఆర్ఆర్ ఫౌండేషన్ రూపొందించిన ప్రత్యేక వాల్ పోస్టర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ఆవిష్కరించారు. సమాజంలో యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, డిజిటల్ నేరాలకు దూరంగా ఉండాలని ఈ పోస్టర్ ద్వారా సందేశం అందించారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని తగ్గించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, యువతలో చట్టాల పై అవగాహన పెంపొందించడం వంటి అంశాల్లో పోలీసు శాఖకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ సహకరిస్తుందని బూడిద రాంరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో పని చేయండి..



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు, ఐఏఎస్‌ను తెలంగాణ గ్రూప్–1 ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి హన్మంతు నాయక్ ఆధ్వర్యంలో అలోక్ కుమార్, సర్వేశ్వర్ రెడ్డి, సోమశేఖర్ తదితర అధికారులు సీఎస్‌ను కలిసి శు భాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రతి అధికారి పని పట్ల అంకితభావం, నిబద్ధతతో వ్యవహరించి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ
పథకాల ఫలాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో కూడా గ్రూప్–1 అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.
ప్రజా సేవే ప్రధాన ధ్యేయంగా భావించి పారదర్శకత, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఆయన అధికారులకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధిలో గ్రూప్–1 అధికారుల పాత్ర మరింత ప్రభావవంతంగా ఉండేలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# రేవంత్ హిందూ అజెండా... టార్గెట్ కమలం...

**హైదరాబాద్, జూలై 2, పెన్ పవర్:**
రాజకీయాల్లో శత్రువును దెబ్బతీయాలంటే వారి బలాన్నే బలహీనతగా మార్చాలనే సూత్రాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కాగా వంటబట్టించుకున్నారు. “ముల్లును ముల్లుతోనే తీయాలి” అనే సామెతను తూచా తప్పకుండా అమలు చేస్తూ, బీజేపీ మార్కు హిందుత్వ రాజకీయాలకు అదే తరహా ఆధ్యాత్మిక బాణంతో సమాధానం ఇచ్చేందుకు రేవంత్ సిద్ధమయ్యారు. కేవలం రెండు లోక్‌సభ సీట్ల నుంచి ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకునే స్థాయికి ఎదిగిన బీజేపీకి ‘హిందుత్వ’ నినాదమే కీలక భూమిక పోషించింది. ఉత్తరాదిన మెజారిటీ రాష్ట్రాల్లో ఇదే ఫార్ములాతో అధికారంలోకి వచ్చిన కమలం పార్టీ, ఇప్పుడు దక్షిణాదిపై.. ముఖ్యంగా తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హిందుత్వ అంశం బీజేపీకి ప్రధాన అజెండాగా మారకుండా ఉండేలా, కాంగ్రెస్ ప్రభుత్వం సనాతన ధర్మాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయడం లేదనే బలమైన సంకేతాలను ప్రజల్లోకి పంపుతూ సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు.ఇందులో భాగంగానే రాష్ట్రంలో
ఏకంగా రూ. 360 కోట్ల భారీ వ్యయంతో అత్యంత అధునాతన గోశాలల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. కేవలం గోరక్షణ ప్రకటనలకే పరిమితం కాకుండా యాదాద్రి, వేములవాడ, మొయినాబాద్‌లలో అంతర్జాతీయ ప్రమాణాలతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ గోశాలల ప్రారంభోత్సవానికి ఏకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించాలని భావించడం రేవంత్ రెడ్డి పక్కా రాజకీయ చతురతకు నిదర్శనం. ప్రధాని మోదీ చేతుల మీదుగానే వీటిని ప్రారంభింపజేయడం ద్వారా రాష్ట్రంలో బీజేపీ చేసే రాజకీయ విమర్శల ముఖాన్ని శాశ్వతంగా మూసివేయవచ్చనేది సీఎం రేవంత్ మాస్టర్ ప్లాన్.గోసంరక్షణ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడటం లేదని నిరూపించేందుకు మూడు ప్రధాన కేంద్రాల్లో విస్తృతమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొయినాబాద్‌లోని యెనికేపల్లిలో 90 ఎకరాల విస్తీర్ణంలో రూ. 160 కోట్ల భారీ వ్యయంతో అధునాతన గోశాల నిర్మాణం కాబోతోంది. ఇది రాబోయే జనవరి నాటికి



పూర్తిస్థాయి నిర్వహణలోకి రానుంది. అదేవిధంగా వేములవాడలో 63 ఎకరాలు, యాదాద్రిలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కొక్కటి రూ. 100 కోట్ల చొప్పున వ్యయం చేస్తూ ఆధునికంగా వీటిని నిర్మిస్తున్నారు. ఇవి వచ్చే మే, జూన్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.గోసంరక్షణతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల పునరుద్ధరణ కార్యక్రమాలకు కూడా రేవంత్ సర్కారు సమాంతరంగా ప్రాధాన్యతనిస్తోంది. ములుగులోని సమ్మక్క-సారలమ్మ గద్దెల పునరుద్ధరణ, బాసర, వేములవాడ సహా దాదాపు 20 ప్రధాన దేవాలయాల అభివృద్ధి పనులను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. యాదాద్రిలో వేద పాఠశాల ఏర్పాటుతో పాటు, రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ చర్యల ద్వారా సనాతన ధర్మ పరిరక్షణలో తాము ఎవరికీ తీసిపోమని కాంగ్రెస్ ఆచరణలో నిరూపిస్తోంది.ఇటీవల బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడా గోవధ జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం, హైదరాబాద్‌కు గోవులు తరలకుండా అడ్డుకోగలగడం ఈ వ్యూహంలో భాగమేనని అధికారులు చెప్తున్నారు. దేశవ్యాప్తంగా ముస్లిం వర్గాల నుంచి కూడా గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలనే డిమాండ్లు వస్తున్న తరుణంలో, రేవంత్ రెడ్డి తీసుకుంటున్న ఈ నిర్ణయాలు సర్వత్రా సానుకూలతను సంపాదిస్తున్నాయి. మొత్తానికి ‘గోమాతాస్త్రం’ ద్వారా బీజేపీ హిందుత్వ రాజకీయాలకు రేవంత్ రెడ్డి వేసిన పక్కా వ్యూహాత్మక ఎత్తుగడ తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది.

# భాగ్యనగరంలో 20 వేల మంది అక్రమవలసదారులా

**హైదరాబాద్, జూలై 2, పెన్ పవర్:**
కేంద్ర ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణలో అక్రమ వలసదారులపై నిఘా సంస్థలు జరిపిన విచారణలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్ నగరంలోనే దాదాపు 21,563 మంది అక్రమ వలసదారులు ఉన్నట్లు తేలింది. వీరిలో 9,500 మంది రోహింగ్యాలు, 4 వేల మంది బంగ్లాదేశీయులు, 1,400 మంది ఆఫ్రికన్ జాతీయులు ఉన్నారు. తక్కువ జీవన వ్యయం, ఎక్కువ ఉపాధి అవకాశాల వల్ల వీరంతా హైదరాబాద్ బాట పట్టారు. ఈ నేపథ్యంలో రోహింగ్యాల నివాసం జాతీయ భద్రతకు తీవ్ర ఆందోళనకరమని నకిలీ గుర్తింపు పత్రాలు రద్దు చేయాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దేశంలోకి చొరబడుతున్న అక్రమ వలసదారుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో.. తెలంగాణ నిఘా వర్గాలు క్షేత్రస్థాయిలో జరిపిన దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. పొరుగు దేశాల నుంచి అక్రమ మార్గాల్లో సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి ప్రవేశించిన విదేశీయుల సంఖ్య వేలల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నిఘా సంస్థలు, ఇమిగ్రేషన్ బ్యూరో, రాష్ట్ర పోలీస్ విభాగాలు సంయుక్తంగా సేకరించిన ప్రాథమిక లెక్కల ప్రకారం.. ఒక్క హైదరాబాద్ మహానగర పరిధిలోనే దాదాపు 20 వేల మందికి పైగా అక్రమ వలసదారులు నివసిస్తున్నట్లు తేలింది. వాస్తవంలో ఈ సంఖ్య రికార్డుల కంటే చాలా ఎక్కువగా ఉండవచ్చని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.అధికారుల సేకరించిన నివేదికల ప్రకారం.. నగరంలో నివసిస్తున్న మయన్మార్ దేశానికి చెందిన రోహింగ్యాల సంఖ్య సుమారు 9,500 వరకు ఉంది. ఇక బంగ్లాదేశ్ దేశానికి చెందిన వారు అధికారికంగా కేవలం 40 మంది మాత్రమే రికార్డుల్లో
ఉండగా.. అనధికారికంగా చొరబడిన వారి సంఖ్య 4 వేలకు పైనే ఉందని తెలుస్తోంది. వీరితో పాటు వివిధ ఆఫ్రికా దేశాలకు చెందిన వలసదారులు 1400 మందికి పైగా ఉన్నారు. బతుకుదెరువు కోసంవచ్చిన వారిపై మానవతా దృక్పథం చూపినప్పటికీ, అక్రమ చొరబాట్లు చట్టరీత్యా నేరం కాబట్టి వీరిని తిరిగి స్వదేశాలకు పంపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా ఆఫ్రికా దేశాలవలసదారులలో కొందరు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యాపారంలో మునిగితేలుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈగల్ అధికారులు జరిపిన నిఘా ఆపరేషన్లలో 2025లో 24 మంది ఆఫ్రికన్లను డ్రగ్స్‌కేసులలో అరెస్టు చేశారు. పాత వారితో కలుపుకుని మొత్తం 42 మందిని ఇప్పటికే డిపోర్టేషన్ ద్వారా వారి దేశాలకు పంపించివేశారు.బంగ్లాదేశ్, మయన్మార్ వంటి సరిహద్దు దేశాల నుంచి వచ్చేచొరబాటుదారులు సాధారణంగా సరిహద్దు రాష్ట్రాల్లోనే ఆవాసం పొందుతారు. కానీ, దేశంలోని ఇతర మెట్రో నగరాలైన ఢిల్లీ, ముంబైలతో పోలిస్తే హైదరాబాద్‌లో జీవన వ్యయం చాలా తక్కువగా ఉండటం, పైగాఇక్కడ ఉపాధి అవకాశాలు పుష్కలంగా దొరుకుతుండటంతో వారంతా భాగ్యనగరం బాట పడుతున్నారు. మరికొందరు విద్య, వైద్యం, వ్యాపార వీసాలపై అధికారికంగానే ఇక్కడికి వచ్చి వీసా గడువు ముగిసినతర్వాత అజ్ఞాతంలోకి వెళ్తున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో వీరి ఆచూకీ కనిపెట్టడం ఇమిగ్రేషన్ బ్యూరోకు కష్టంగా మారింది.హైదరాబాద్‌లో రోహింగ్యాలు, ఇతర దేశాల అక్రమ వలసలపై తెలంగాణజనసేన పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ‘హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వేలాదిగా రోహింగ్యాలు నివసించడంజాతీయ భద్రతకు తీవ్ర ముప్పు. అక్రమ వలసలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, నకిలీ గుర్తింపు పత్రాల తయారీ వల్ల మన ప్రభుత్వ వ్యవస్థలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. మోసపూరితంగా పొందినఆధార్ కార్డులు, ఓటర్ ఐడీలను తక్షణమే స్క్రీనింగ్ చేసి రద్దు చేయాలి’ అని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశాన్ని రాజకీయ కోణంలో చూడకుండా.. దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన
విషయంగా పరిగణించి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ కఠినమైన చర్యలు చేపట్టాలని కోరారు.

# ఓయూ లో ఎబివిపి నిరసన.. ఉద్రిక్తత

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉస్మానియా పరిరక్షణ కు ఉద్యమిద్దాం అంటూ ఓయూ లో ఎబివిపి విద్యార్థులు నిరసన కు దిగారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసారు. పోలీసులు దిష్టిబొమ్మ దహనం అడ్డుకునే ప్రయత్నం చేసారు. ఈ నేపథ్యంలో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ కి వెయ్యి కోట్ల నిధులను, పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలును వెంటనే విడుదల చేయాలి ఎబివిపి డిమాం చేసింది.

## మీడియాకు అనుమతి నిరాకరణ.. కంచన్బాగ్ పోలీసుల తీరుపై విమర్శలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్ మరియు =ా ప్రవీణ్ కుమార్ను, పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి కంచన్బాగ్ పోలీస్ స్టేషన్కు తరలించిన నేపథ్యంలో, అక్కడికి న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులకు పోలీసులు అనుమతి నిరాకరించారు. పోలీస్ స్టేషన్ ప్రధాన గేటుకు తాళం వేసి, మీడియా సిబ్బందిని లోపలికి అనుమతించకుండా అడ్డుకోవడం జరిగింది.
అదే సమయంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కూడా స్టేషన్లోకి వెళ్లనివ్వకపోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు నిర్వర్తించేందుకు వచ్చిన మీడియాను అడ్డుకోవడం సరైంది కాదని పలువురు మీడియా ప్రతినిధులు అభిప్రాయపడగా, ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల తీరు పట్ల కార్యకర్తలు ప్రభుత్వం పై వ్యతిరేక నినాదాలు చేసారు.

# దుండిగల్ లో స్థానికుల ధర్నా

**హైదరాబాద్ పెన్ పవర్:**
కుత్బుల్లాపూర్ మల్లంపేట్ సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి దుండిగల్ మునిసిపల్ సర్కిల్ మల్లంపేట రహదారి పై స్దానికులు ధర్నా చేపట్టారు.. మల్లంపేట ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుండి బాచుపల్లి పోయే రహదారి పై ఫ్లెక్స్ లు, ప్లే కార్డు చేపట్టి పాదయాత్ర చేస్తూ మాకు న్యాయం కావాలి,ఓల్డ్ హైదరాబాదు రోడ్డు ను ఓపన్ చేసి మల్లంపేట గ్రామాన్ని కాపాడాలంటూ ప్లే కార్డ్ చేతబూని దర్నా చేసారు... మాకు పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు ఉండాలని,,,ఒక వేళ కొత్త ప్లాన్ ప్రకారం రోడ్డు సవరణలు చేస్తే మేము నష్టపోతాము,,నాకు న్యాయం కావాలి,,మాస్టర్ ప్లాన్ ప్రకారం మాకు 3 రోడ్డు ఉన్నాయి,,చుట్టుపక్కల ఉన్న అపార్ట్మెంట్ మరియు గేటెడ్ కమ్యూనిటీ వాళ్ళతో మాకు ట్రాఫిక్ ఇబ్బందులు చాలా ఉన్నాయి కావున పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు కావాలని ధర్నా చేశారు.యడం జరుగుతుంది

# ఫోజులు కొట్టింది.. లోకేషన్ మార్చింది ఎవరూ

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ భవన్కి వస్తానని ఫోజులు కొట్టమన్నది ఎవరు.. మళ్లీ గన్ పార్క్ అని లోకేషన్ మార్చామన్నది ఎవరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. నీకంటే పోలీస్ వాళ్ల ఎస్కార్ట్ ఉంది.. కానీ మమ్మల్ని ఏమో బైటకి పోతే పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు . పోలీసులని ఎవరు పంపుతున్నారు.. ముఖ్యమంత్రా, లేదా మంత్రులా . చర్చలని మీరే పిలుస్తారు.. మళ్లీ పారిపోయేది మీరే . చాతకాని వెధవలు ఎవరో ప్రజలు చూస్తున్నారు . ఇప్పటికైనా గన్ పార్క్ దగ్గర ఉండు మేము వస్తాము.. మళ్లీ మీ పోలీస్ వాళ్ళని పిలిచి అరెస్ట్ చేయించొద్దు . నిద్ర పోయే వాడిని లేపొచ్చు.. నిద్రని నటించే వాడిని ఎక్కడ లేపగలమని అన్నారు.

## శంషాబాద్ ఎయిర్పోర్టు లో మహిళలు అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** శంషాబాద్ ఎయిర్పోర్టులో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 20 మంది మహిళలు అరెస్ట్ చేసారు. వీరంతా ఒమన్ ఎయిర్వేస్లో నకిలీ వీసాలతో మస్కట్ వెళ్లేందుకు ప్రయత్నించారు. నకిలీ వీసాలను గుర్తించడంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.తరువాత అందరిని శంషాబాద్ ఔట్పోస్టుకు అప్పగించారు. చెల్లని వీసాలిచ్చి ఏజెంట్ మోసం చేశాడని మహిళలు వాపోయారు.

## పోలీసులను అడ్డం పెట్టి ఆపుతున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:** సవాల్ విసిరితే అప్పుల లెక్క చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. విద్యాశాఖ అవినీతిపై చర్చకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. మేము వస్తాము అంటే ఆపుతున్నారు. ముగ్గురు మంత్రులకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. పోలీసులను అడ్డంపెట్టి ఆపినా మిమ్మల్ని వదిలిపెట్టం. మీడియా సాక్షిగా రాష్ట్ర ప్రజల ముందు వీళ్ల బండారం బట్టబయలు చేస్తామని అన్నారు.

## ఆదిభట్లలో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్ సమీపంలో ఉన్న టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (గౌర ఏరోస్పేస్ టెక్నాలజీ యూనిట్)లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. యంత్రాలను ఆన్ చేసిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాద సమయంలో కంపెనీలో ఉద్యోగులు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

# బాపట్లలో భారీగా అక్రమ రేషన్ బియ్యం పట్టివేత.. వాహనం సీజ్!

**కాకుమాను నుంచి తరలిస్తుండగా సివిల్ సప్లైస్ అధికారుల మెరుపు దాడి.. డ్రైవర్ పరార్.**
**అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం సీజ్**
**అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్నీ బాపట్ల సివిల్ సప్లైస్ అధికారులు**

**హైదరాబాద్ పెన్ పవర్:** గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు సి ఎస్ డీ టి ఫణి కుమార్ తెలిపారు.కాకుమాను వైపు నుండి మూలపాలెం మీదుగా బాపట్ల వైపు వస్తున్న రేషన్ బియ్యం కలిగిన అశోక లైలాండ్ మినీ లారీ ని రైలుపేట లోని జమేధర్ పేట వద్ద పట్టుకున్నట్లూ పేర్కొన్నారు.అధికారులను చూసి డ్రైవర్ పరార్ అయినట్లు చెప్పారు. వాహనం పాలపర్తి వెంకట రావు, ఇటీకం పాడు, రోడ్డు పొన్నూరు పేరుతో వాహనం రిజిస్ట్రేషన్ అయి ఉందన్నారు.స్తానిక రైస్ మిల్లుకు బియ్యాన్ని చేరవేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.ఐతే ఇక్కడి రైస్ మిల్లులో కొన్నాళ్లుగా అక్రమ రేషన్ బియ్యం దందా కొనసాగుతున్నట్లు సమాచారం.విషయం తెలుసుకున్న జిల్లా సివిల్ సప్లైస్ అధికారి జగన్మోహన్ రావు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో ముమ్మర తనిఖీ లు నిర్వహిస్తున్నారు.ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న,నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాబోయే నూతన దంపతులను ఆశీర్వదించిన మంత్రి లోకేష్

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుపతి భూపాల్ హౌసింగ్ లోని టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ కే.గౌతమి శ్వేత నివాసాన్ని గురువారం ఉదయం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. కాబోయే నూతన వధూవరులు ఏపీ కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, కే.గౌతమి శ్వేతలను మంత్రి లోకేష్ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ సమక్షంలో వధూవరులు ఉంగరాలు మార్చుకున్నారు. గురువారం రాత్రి తిరుమలలోని శ్రీ శృంగేరీ శారద పీఠంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతల వివాహం జరగనుంది. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# ఇద్దరూ కలిసిరండి..

**హైదరాబాద్ పెన్ పవర్:** కటీఆర్ చేసిన వ్యాఖ్యలపై నేను స్పందించాను. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని వాస్తవాలు చెప్పానుని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నా వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ హరీష్ రావు గన్పార్క్ అమరవీరుల స్తూపం వద్దకు వస్తానన్నారు.లి అందుకే చెబుతున్నా... బావ--బామ్మర్ది ఇద్దరూ కలిసి గన్పార్క్కు రండి. నేను కూడా గన్పార్క్ అమరవీరుల స్తూపం వద్దకు వస్తున్నాను. మీరిచ్చిన సవాల్కు అక్కడే, ప్రజల ముందే వాస్తవాలతో సమాధానం చెబుతాను. లి బావ ఒకచోట... బామ్మర్ది మరోచోట మాట్లాడటం ఎందుకు? ఇద్దరూ కలిసి గన్పార్క్కు రండి. మీ ఇద్దరికీ ఒకేసారి అక్కడే సమాధానం ఇస్తానని అన్నారు.

# పఠాన్ చిన్న సత్తార్ ఖాన్ ట్రస్ట్ సేవలు ఎనలేనివి.. నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం.

**హైదరాబాద్ పెన్ పవర్:**
నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లో పఠాన్ చిన్న సత్తార్ ఖాన్ ట్రస్ట్ ద్వారా బంగారు వ్యాపారి పఠాన్ యూసుఫ్ చేస్తున్న సేవలు అమూల్యం అని నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం అన్నారు. 02-07-2026 గురువారం ఉదయం తొమ్మిది గంటలకు దాసరి సురేష్ అనే వికలాంగునికి మూడు చక్రాల సైకిల్ యూసుఫ్ ఆర్థిక సహాయంతో రావు సుబ్రహ్మణ్యం చేతులమీదగా అందించారు.
కార్యక్రమంలో బీజేపీ నాయకులు వరికూటి నాగేశ్వరావు, పులుగుజ్జు మహేష్,జనసేన పార్టీ నాయకులు ముత్యాల బాబు ప్రముఖ న్యాయవాది సాపా ఆదినారాయణ,కాపుసంఘం నాయకులు అంకిరెడ్డి రమేష్, గట్టా మెడికల్స్ ఆధిపతి గట్టా రమేష్,తన్నీరు సురేష్, గంటా పాపారావు,రావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొన్నారు.

# కంట్రీ క్లబ్ లో ప్రత్యేక ఇండో-టర్కియే కల్చరల్ అండ్ హాస్పిటాలిటీ ఈవెనింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** బేగంపేట కంట్రీ క్లబ్లో ప్రత్యేక ఇండో--టర్కియే కల్చరల్ అండ్ హాస్పిటాలిటీ ఈవెనింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రిపబ్లిక్ ఆఫ్ టర్కియే కాన్సుల్ జనరల్ శ్రీ ఓర్హాన్ యాల్మన్ ఒకాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కంట్రీ క్లబ్ వ్యవస్థాపకులు, చైర్మన్ రాజీవ్ రెడ్డి కాన్సుల్ జనరల్కు కంట్రీ క్లబ్ ప్రీమియం మెంబర్షిప్ థాయ్లాండ్ మాస్టర్ కార్డ్ ను అందజేసి ఘనంగా సత్కరించారు.
ఈ వేడుకల్లో భాగంగా టర్కియే సంపన్న సాంస్కృతిక వారసత్వం, నైపుణ్య కళలు, ఆధునిక ఫ్యాషన్కు ప్రతిబింబంగా టర్క్ మోడా పేరుతో ప్రత్యేక టర్కిష్ థీమ్ ఫ్యాషన్ షోను నిర్వహించారు. మూడు సీక్వెన్స్ లో కొనసాగిన ఫ్యాషన్ షో అందరిని మంత్రముగ్దులను చేసింది. భారత్--టర్కియే దేశాల మధ్య సాంస్కృతిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పరస్పర అవగాహనను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా కొనసాగింది.
ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కంట్రీ క్లబ్ వ్యవస్థాపకులు, చైర్మన్ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ... పర్యాటకం, ఆతిథ్య రంగాల ద్వారా ప్రజలు, సంస్కృతులు, దేశాలను అనుసంధానించడం కంట్రీ క్లబ్ లక్ష్యమని చెప్పారు. సంస్థ అంతర్జాతీయ విస్తరణలో తదుపరి దశలో యూరప్కు వ్యూహాత్మక ప్రవేశ ద్వారంగా టర్కియేను పరిగణిస్తున్నట్లు వెల్లడించారు

# పెద్దిరెడ్డి, చెవిరెడ్డిలతో నెగ్గేదెలా

**తిరుపతి,జూలై 2 పెన్ పవర్:** వైసీపీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ బలం పుంజుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా సీనియర్ల మధ్య పెద్ద వైరం నడుస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది. ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు నేతల మధ్య ఇప్పుడు విభేదాలు పతాక స్థాయికి చేరినట్లు టాక్ నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డి ఆ ఇద్దరు నేతల విషయంలో ఎటు తేల్చుకోలేకపోతున్నట్లు తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు అంటేనే ముందుగా గుర్తొచ్చేది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. మొన్నటి ఎన్నికల్లో ఆ జిల్లా నుంచి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు గెలిచారు. అదే సమయంలో రోజాతో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి లాంటి వారు ఓడిపోయారు. అయితే అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి మాట నడిచేది చిత్తూరు జిల్లాలో. రాయలసీమలో సైతం ఆయన హవా ఉండేది. అటువంటిది ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత.. పెద్దిరెడ్డి కి వ్యతిరేకంగా చెవిరెడ్డి పావులు కదుపుతున్నట్లు ప్రచారంలో ఉంది.వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి హవా అంతా ఇంతా కాదు. ఏకంగా కుప్పంలో చంద్రబాబును, హిందూపురంలో బాలకృష్ణను ఓడించేందుకు ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. అదే సమయంలో సొంత పార్టీ వారు సైతం ఆయన కనుసన్నల్లో ఉండాల్సిందే. లేకుంటే ఇబ్బందికర పరిస్థితులు తప్పేవి కావు. అందుకే అప్పట్లో ఆర్కే రోజాతో పాటు చెవిరెడ్డి లాంటివారు పెద్దిరెడ్డి విషయంలో చాలా గౌరవభావంతో ఉండేవారు. దానికి ప్రధాన కారణం భయం. అయితే ఇప్పుడు వైసీపీ ఓడిపోయిన తర్వాత పెద్దిరెడ్డి విషయంలో వైసీపీ నేతల తీరు మారింది.ప్రధానంగా ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తీవ్రంగా విభేదిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి రాయలసీమను చూసేవారు. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి వెంట నిత్యం తాడేపల్లి కార్యాలయంలోనే ఉండేవారు. కానీ ఇప్పుడు మద్యం కుంభకోణం కేసు పుణ్యమా అని జగన్మోహన్ రెడ్డి విషయంలో పెద్దిరెడ్డి వైఖరి మారినట్లు ప్రచారంలో ఉంది. అదే సమయంలో తాడేపల్లి లో చేరారు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. పెద్దిరెడ్డి ఫ్యామిలీ విషయంలో జగన్ చెవిరెడ్డి ఇస్తున్న సమాచారాన్ని నమ్ముతున్నారని పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం సాగుతోంది. దీంతో ఆ ఇద్దరు నేతల మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయని.. ఆ ఇద్దరు నేతలను సర్ది చెప్పలేక జగన్మోహన్ రెడ్డి బాధపడుతున్నట్లు ప్రచారంలో ఉంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# పంచాయితీ నేతలకు నిబిన్ సర్జరీ..

**హైదరాబాద్, జూలై 2, పెన్ పవర్:**
తెలంగాణ బీజేపీలో అంతర్గత పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న అధిష్ఠానం.. తప్పులు చేస్తున్న, నిర్లక్ష్యంగావ్యవహరిస్తున్న నేతలపై కఠినంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే తెలంగాణలో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పార్టీ ఆఫీస్ బేరర్ల పనితీరుపై తీవ్ర అసంతృప్తివ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతాన్ని విస్మరించి, కేవలం ఆఫీసుల్లో ప్రెస్ మీట్లకే పరిమితమవుతున్న నేతల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చసాగుతోంది.రాష్ట్రంలో ఎవరెవరు ఏం చేస్తున్నారు? ఎవరి వైఖరి ఎలా ఉంది? అనే విషయాలపై హైకమాండ్ వద్ద పూర్తి చిట్టా ఉందని నితిన్ నబీన్ నేరుగానే హెచ్చరించినట్లు సమాచారం. పదవులు వచ్చేవరకు ఒకలా.. వచ్చిన తర్వాత మరోలా వ్యవహరిస్తున్న కొందరు నేతల జాబితా ఇప్పటికే సిద్ధమైందని ఆయన సంకేతాలు ఇచ్చారు. బాధ్యతలు దక్కిన తర్వాత క్షేత్రస్థాయి పర్యటనలు చేయకుండా, ప్రజాసమస్యలను గుర్తించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రజలు బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, అధికారంలోకి వచ్చేందుకు అనుకూలఅవకాశాలు ఉన్నాయని.. అలాంటి సువర్ణావకాశాన్ని కొందరు నేతల వైఖరి వల్ల పాడుచేసుకోలేమని ఆయన గట్టిగా హెచ్చరించినట్లు తెలుస్తోంది.గడిచిన ఆరు నెలల కాలంలో ఏ నాయకుడు ఎంతవరకుప్రజల్లో ఉన్నారు? పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను ఏ మేరకు విజయవంతం చేశారు? అనే అంశాలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు స్వయంగా ఒక ప్రత్యేక నివేదికను కోరినట్లు విశ్వసనీయ సమాచారం.ఈ ఆరు నెలల నివేదిక ఆధారంగానే భవిష్యత్తులో నేతల పదవుల కొనసాగింపుపై కీలక నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చిచెప్పారు. ఎవరెవరు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు, ఎవరెవరుఅంటీముట్టనట్లు ఉంటున్నారనే అంశంపై ఇప్పటికే అధిష్టానం ఒక స్పష్టతకు వచ్చింది. పనితీరు మార్చుకోని పక్షంలో, స్వచ్ఛందంగా పదవుల నుంచి తప్పుకోవాలని, లేదంటే అధిష్టానమే కఠిన చర్యలుతీసుకుని రాష్ట్ర కమిటీలో భారీ మార్పులు చేర్పులు చేస్తుందని హెచ్చరించారు.పార్టీలో సొంత అజెండాలు నడుపుతూ, గ్రూపు రాజకీయాలకు తెరలేపుతున్న నేతలపై నితిన్ నబీన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడినట్లు సమాచారం. గ్రూపు రాజకీయాలను ఏమాత్రం సహించే ప్రసక్తే లేదని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత విభేదాలు పక్కనబెట్టి ఉమ్మడిగా పనిచేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని గట్టి సంకేతాలు పంపారు. నియోజకవర్గాల్లో పట్టు పెంచుకోకుంటే కఠిన చర్యలు తప్పవని, బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తే పదవులను వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించడం ఇప్పుడు టీబీజేపీలో తీవ్ర కలకలం రేపుతోంది.ఒకవైపు తెలంగాణలో నితిన్ నబీన్ పర్యటన సాధారణ శ్రేణుల్లో తీవ్ర జోష్ నింపినప్పటికీ, మరోవైపు ఆయన చేసిన హెచ్చరికలు పార్టీలోని కొందరు ముఖ్య నేతలకు, ఆఫీస్ బేరర్లకు ఇబ్బందికరంగా మారాయి. అధికారం చేజిక్కించుకునేందుకు అన్ని అవకాశాలు ఉన్నా, కొందరి తీరువల్ల పార్టీకి నష్టం జరుగుతోందని, అలాంటివాళ్లను దూరం పెట్టక తప్పదని హైకమాండ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతోంది. మరి ఇప్పటికైనా ఈ హెచ్చరికలను గుణపాఠంగా తీసుకుని, నితిన్ నబీన్ దిశానిర్దేశాన్ని టీబీజేపీ నేతలు తూచ తప్పకుండా పాటిస్తారా? అంతర్గత విభేదాలను పక్కనబెట్టి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కలిసికట్టుగా కృషిచేస్తారా? లేదా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# మూడు ఎయిర్ పోర్టులకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, జూలై 2, పెన్ పవర్:** తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్. రాష్ట్రంలో ప్రస్తుతం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాత్రమే ప్రయాణికులకు అందుబాటులో ఉంది. విమాన ప్రయాణం చేయాలంటే రాష్ట్ర నలుమూలల ప్రజలు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు రావాల్సి వస్తోంది. దీంతో ఇక్కడి వరకు రావాల్సిన అవసరం లేకుండా సమీప ప్రాంతంలోనే ప్రజలకు విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కొత్త ఎయిర్‌పోర్టులపై దృష్టి పెట్టింది. మరో మూడు ఎయిర్‌పోర్టులను నిర్మించేందుకు ముందడుగు వేసింది. ఇప్పటికే వరంగల్ వద్ద మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు ఆమోదం లభించగా.. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెలలో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఇక ఆదిలాబాద్, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దమైంది.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఇక్కడ వాయుసేనకు సంబంధించి ఎయిర్‌స్ట్రిప్ ఉండగా.. దీని కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీనిని అనుకుని ఉన్న భూమితో పాటు మరికొంత భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ నిర్మించనున్నారు. కేంద్ర విమానయాన సంస్థ ఇప్పటికే దీని నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మిలిటరీతో పాటు పౌరులకు కూడా ఉపయోగపడేలా దీని నిర్మాణం చేపట్టనున్నారు. ఇక కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుండగా.. దీనికి అనుమతి రావాల్సి ఉంది. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుపై కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది. త్వరలోనే తుది అనుమతులు లభించనున్నాయని సమాచారం.తాజాగా హైదరాబాద్‌లో ఏరోమార్ట్ 2026 సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త ఎయిర్‌పోర్టులపై కీలక ప్రకటన చేశారు. వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు వచ్చే నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం నుంచి అనుమతి వచ్చిందని, డీపీఆర్ కూడా రెడీ అయిందన్నారు. మిలిటరీ, పౌర అవసరాలకు ఉపయోగపడేలా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు కేంద్రం నుంచి అనుమతి రావాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగానికి అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. స్పేస్, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు అవసరమైన విడిభాగాలు తయారుచేసే 1500కిపైగా ఎంఎస్ఎంఈలు ప్రస్తుతం రాష్ట్రంలో పనిచేస్తున్నాయన్నారు. ప్రపంచంలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లకు మేడ్ ఇన్ తెలంగాణకు లేబుల్‌తో కూడిన విడిభాగాలు అమర్చబడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో పారిశ్రామిక ప్రగతికి ఇదే ఒక నిదర్శనమని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# పోలీస్ శాఖలో 20 వేల పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయాలి




**ఇబ్రహీంపట్నం :** రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని, అలాగే అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటికీ నోటిఫికేషన్లు జారీ చేసి భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కమిటీ సమావేశం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పటి వరకు గత ప్రభుత్వ నోటిఫికేషన్లతో కలిపి కేవలం 55 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని పేర్కొన్నారు. ఇంకా 1.45 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అదేవిధంగా జాబ్ క్యాలెండర్‌ను నామమాత్రంగా ప్రకటించి అమలు చేయడం లేదని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాలయాపన చేస్తూ వారిని మోసం చేస్తోందన్నారు. స్పష్టమైన జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి అమలు చేయాలని, తక్షణమే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో 20 వేల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని స్వయంగా రాష్ట్ర మాజీ డీజీపీ, ప్రస్తుత డీజీపీలు పలుమార్లు ప్రకటించారని అన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బీఆర్ఎస్ కాదు ఎఫ్ఆర్ఎస్.. పొంగులేటి పంచ్ మామూలుగా లేదుగా



**హైదరాబాద్, జూలై 2, పెన్ పవర్:** అధికార పార్టీపై విపక్షాలు విమర్శలు చేయటం మామూలే. అధికారంలోకి వచ్చిన కొంతకాలం వరకు విమర్శల పదును ఒక మోస్తరుగా ఉంటుంది. పాలన మొదలెట్టిన రెండేళ్ల తర్వాత నుంచి విపక్షాల విమర్శల వర్షం అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. దీనికి తోడు పాలనా పరమైన తప్పులు.. వైఫల్యాలు ప్రతి ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటాయి. అయితే.. వీటిని ఎంత తక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే అంత మంచిది. ఇప్పుడు అలాంటి పనే చేస్తోంది రేవంత్ సర్కారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటిన నేపథ్యంలో.. నిత్యం ఏదో అంశం మీద విపక్ష బీఆర్ఎస్ ముఖ్యనేతలు కేటీఆర్.. హరీశ్ రావులు విమర్శలు సంధిస్తున్న వేళ.. అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ ముందుంటే.. ఆ తర్వాతి స్థానాల్లో పొంగులేటి.. శ్రీధర్ బాబు.. భట్టి.. ఉత్తమ్ తదితరులు ఉంటున్నారు. ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పిస్తున్న బీఆర్ఎస్ ముఖ్యనేతలపై విరుచుకుపడుతున్నారు. ఇదిలా ఉండగా.. తాజాగా మంత్రిపొంగులేటి ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం నెత్తిన రూ.8 లక్షల కోట్లకు పైనే అప్పుల భారాన్ని మోపిందన్న ఆయన.. కేసీఆర్ కుటుంబానికి మాత్రం వేల కోట్ల ఆస్తులు పెరిగినట్లుగా ఆరోపించారు. అంతేకాదు బీఆర్ఎస్(భారత రాష్ట్రసమితి) పేరును సరికొత్తగా ఎఫ్ఆర్ఎస్ గా పేర్కొనటం విశేషం. ఇంతకూ ఎఫ్ఆర్ఎస్ మరేమిటోకాదు.. ఫాంహౌస్ రాష్ట్ర సమితిగా ఆయన అభివర్ణించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికి ప్రజాసమస్యలపై పోరాడకుండా కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారంటూ మండిపడుతూ.. బీఆర్ఎస్ పేరును ఎఫ్ఆర్ఎస్ గా మార్చుకునే సమయం ఆసన్నమైందంటూ ఘాటుగా విరుచుకుపడ్డారు. చెల్లి.. బావ ఫోన్లను ట్యాప్ చేసిన వ్యక్తులు సభ్యత.. సంస్కృతి గురించి మాట్లాడటమా? అంటూ ఏద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఫామ్ హౌస్ పార్టీకి.. గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇళ్లుకట్టించిన పార్టీకి మధ్య పోటీ జరగనుందన్నారు. మరోసారి కారు బోల్తా పడటం ఖాయమన్న ధీమాను వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితమే కేసీఆర్ ను ఫామ్ హౌస్ పశుపతిగా ముఖ్యమంత్రి రేవంత్ అభివర్ణించిన వేళ.. పొంగులేటి సైతం రేవంత్ ఫాంహౌస్ మాటల్ని అందిపుచ్చుకొని బీఆర్ఎస్ కు కొత్త పేరు పెట్టిన పేరు ఆసక్తికరంగా మారింది. ఈ ఫామ్ హౌస్ పంచ్ లకు గులాబీ అధినేత ఏరీతిలో రియాక్టు అవుతారో చూడాలి.

# రెండు రాష్ట్రాల మధ్య చెత్త పంచాయితీ

**అదిలాబాద్, జూలై 2, పెన్ పవర్:**
తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర మధ్య మరోసారి చెత్త పంచాయతీ తెరపైకి వచ్చింది. దీంతో ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీదర్ మున్సిపాలిటీ చెత్తను తీసుకొచ్చి తమ గ్రామంలో వేస్తుండటంపై.. మల్గి గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బీదర్ నుంచి చెత్తతో వచ్చిన మున్సిపాలిటీ వాహనాలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ తీవ్ర గందరగోళం నెలకొంది.తెలంగాణ కర్ణాటక సరిహద్దులో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కర్ణాటకలోని బీదర్ మున్సిపాలిటీ చెత్తను.. తెలంగాణలోని మల్గి గ్రామం సమీపంలో డంప్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు చేపట్టిన నిరసన బుధవారం తీవ్ర రూపం దాల్చింది. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉదయం నుంచే ఉద్రిక్త వాతావరణం నెలకొనగా.. ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు గంటల పాటు నిలిచిపోయాయి. చెత్త వాహనాలను గ్రామస్తులు అడ్డుకోవడంతో ఆగ్రహించిన అధికారులు ప్రధాన రహదారిపైనే చెత్త పారబోసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో బీదర్-మల్గి మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇరు రాష్ట్రాల పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని గ్రామస్తులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కొన్ని రోజులుగా బీదర్ మున్సిపాలిటీకి చెందిన వ్యర్థాలను తెలంగాణ సరిహద్దులోని మల్గి గ్రామ శివారులో పారబోస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ చెత్త కారణంగా కాలుష్యం పెరిగి.. దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని వారు పలుమార్లు డిమాండ్ చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని చెబుతున్నారు.చెత్తతో వచ్చిన మున్సిపల్ వాహనాలను బుధవారం రోజున మల్గి గ్రామస్తులు అడ్డుకోవడంతో ఈ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. గ్రామస్తులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీదర్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది.. మల్గి-బీదర్ ప్రధాన రహదారిపైనే చెత్తను పారబోసినట్లు స్థానికులు ఆరోపించారు. సుమారు 40 వాహనాల చెత్తను రోడ్డుపై కుమ్మరించడంతో అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా మూసుకుపోయింది.దీంతో తెలంగాణ-కర్ణాటక మధ్య నడిచే ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.రెండు వైపులా వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఇరు రాష్ట్రాల పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు, రోడ్డుపై పారబోసిన చెత్తను తొలగించే ఏర్పాట్లు ప్రారంభించారు.తమ గ్రామ శివారులో డంపింగ్ యార్డు కొనసాగించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని మల్గి గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా సరిహద్దు ప్రాంతంలో చెత్త పారబోయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.



# కవిత పార్టీకి బీఆర్ఎస్ బ్రేకులు!

**హైదరాబాద్, జూలై 2, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన రాజకీయ సమరం మొదలైంది. ఒకప్పుడు రాష్ట్ర గమనాన్ని మార్చిన టీఆర్ఎస్ అనే మూడక్షరాల పేరు ఇప్పుడు మళ్లీ తెరపైకి రావడమే కాకుండా, తీవ్ర ఉత్కంఠకు కేంద్ర బిందువుగా మారింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం వద్ద అభ్యంతరాల సుడిగుండంలో చిక్కుకుంది.భారత రాష్ట్ర సమితి నుంచి గతేడాది సెప్టెంబరు 2న కవిత సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత కవిత తన రాజకీయ భవిష్యత్తు కోసం సొంతంగా అడుగులు వేశారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఏప్రిల్ 25న ఆమె అధికారికంగా సరికొత్త ప్రాంతీయ పార్టీని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఈ పార్టీ ఆవిర్భవించిందని ఆమె స్పష్టం చేశారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఈసీఐ నిబంధనల ప్రకారం.. తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జగృతి, తెలంగాణ ప్రజా శక్తి అనే ఐదు పేర్లను ప్రతిపాదించగా, అందులో 'తెలంగాణ రక్షణ సేన' పేరును పరిశీలనకు తీసుకుంటూ ఏప్రిల్ 30న ఈసీ ప్రాథమిక ఆమోదం తెలిపింది. ఈ పార్టీకి సంక్షిప్త నామంగా 'ఏ=రా' అని నిర్ణయించడంతో ఒక్కసారిగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి.తెలంగాణ రక్షణ సేన పేరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి భారీ ఎత్తున అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఈ పేరును కవిత పార్టీకి కేటాయించవద్దంటూ దాదాపు 600 నుంచి 700 వరకు అభ్యంతరాలు ఈసీకి అందినట్లు సమాచారం. ఈ అభ్యంతరాలలో అత్యధిక భాగం బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య శ్రేణులు, వారి అనుచరుల నుంచే వెళ్లినట్లు తెలుస్తోంది. గతంలో కేసీఆర్ నాయకత్వంలోని 'తెలంగాణ రాష్ట్ర సమితి' పేరును 'భారత రాష్ట్ర సమితి' గా మార్చినప్పటికీ, ప్రజల్లో ఇప్పటికీ టీఆర్ఎస్ సెంటిమెంట్ బలంగా ఉంది. ఇప్పుడు అదే సంక్షిప్త నామంతో కవిత సరికొత్త పార్టీ పెడితే, భవిష్యత్తులో తమ రాజకీయ మనుగడకు, ఓటు బ్యాంకుకు భారీ గండిపడుతుందనే ఆందోళన భారాస నేతల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే ఈ పేరును ఎలాగైనా అడ్డుకోవాలని వారు గట్టిగా ప్రయత్నిస్తున్నారు.మరోవైపు, ఈ అభ్యంతరాలపై కవిత నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రతినిధులు దీటుగానే స్పందిస్తున్నారు. ఇప్పటికే ఈసీ లేవనెత్తిన పలు ప్రాథమిక అభ్యంతరాలకు తాము లిఖితపూర్వక వివరణ ఇచ్చామని వారు పేర్కొంటున్నారు. మిగిలిన అభ్యంతరాల వివరాలను కూడా తమకు అధికారికంగా పంపితే, వాటికి కూడా చట్టబద్ధమైన సమాధానాలు ఇస్తామని స్పష్టం చేస్తున్నారు.ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘంతో ఈ విషయమై నిరంతరం ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతున్నాయని తెలుస్తోంది. సాంకేతికంగా, చట్టపరంగా తాము సరైన నిబంధనలే పాటించామని కవిత వర్గం చెబుతోంది. త్వరలోనే ఈసీ నుంచి తమకు సానుకూల స్పందన వస్తుందని, 'తెలంగాణ రక్షణ సేన' పేరు అధికారికంగా ఖరారవుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.అభ్యంతరాల తీవ్రత, వాటికి పార్టీ ప్రతినిధులు ఇచ్చే వివరణలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కేంద్ర ఎన్నికల సంఘం తుది నిర్ణయం తీసుకోనుంది. కవితకు పాత సెంటిమెంట్ కలిసివచ్చి 'టీఆర్ఎస్' పేరు దక్కుతుందా.. లేక బీఆర్ఎస్ వేసిన బ్రేకులతోఈసీ కొత్త లింకులు పెడుతుందా అన్నది తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

# వారికి వన్ టైం సెటిల్మెంట్...టీడీపీలో చర్చ ?

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ ఎంతో మందికి అవకాశాలు ఇచ్చిన పార్టీ. ఆ పార్టీ నుంచి గెలిచిన వారు లోక్ సభ స్పీకర్ స్థాయి దాకా వెళ్లారు, అలాగే ముఖ్యమంత్రులు కూడా అయ్యారు. గవర్నర్లు కేంద్ర మంత్రులు అయ్యారు. దేశంలో వేరే ఏ ప్రాంతీయ పార్టీకి లేనంత పొలిటికల్ హిస్టరీ ఈ విషయంలో టీడీపీకి ఉంది. అయితే పార్టీ ఇచ్చిన అవకాశాలు చాలా మంది సద్వినియోగం చేసుకుంటే కొందరు మాత్రం తమకు తోచిన ధోరణిలో పోతున్నారు. ఇక 2024 లో టీడీపీ టికెట్లలో అధిక శాతం యువతకు కొత్తవారికి ఇచ్చింది. సర్పంచుల నుంచి నేరుగా ఎమ్మెల్యేలు అయిన వారు ఉన్నారు. అలాగే పార్టీ పదవులు చేపడుతూ ఎమ్మెల్యేలు ఎంపీలుగా అయిన వారు ఉన్నారు. వీరిలో విషయం తెలిసిన వారు మళ్లీ మళ్లీ గెలవాలని అనుకునే వారు తపన పడుతున్నారు. జనంతో పార్టీ జనంతో మమేకం అవుతున్నారు. అయితే వచ్చిన పదవిని అధికారాన్ని చూసి ఉబ్బి తబ్బిబ్బు అవుతున్న వారు మాత్రం తమదైన శైలిలో పని చేస్తున్నారు. వీరి విషయంలో అధినాయకత్వం ఎన్ని సార్లు క్లాస్ తీసుకున్నా వ్యవహారం మాత్రం చక్కబడడం లేదని అంటున్నారు.



**పనితీరు మదింపు :**

ఇదిలా ఉంటే రెండేళ్ల కూటమి పాలన పూర్తి అయింది. 2024 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన 135 మంది ఎమ్మెల్యేల పనితీరుని అయితే అధినాయకత్వం చాలా జాగ్రత్తగా మదింపు చేస్తోంది అని అంటున్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఎంత ప్రజా సమస్యల మీద ఎమ్మెల్యేల స్పందన ఎలా ఉంది. ప్రజలతో వారికి ఉన్న కనెక్షన్, పార్టీ క్యాడర్ తో మసలుతున్న వైనం ఇవన్నీ కూడా హైకమాండ్ చాలా నిశితంగా పరిశీలన చేస్తోంది అని అంటున్నారు. ఈ విషయంలో అయితే టెలి కాన్ఫరెన్సులు పెట్టి సమావేశాలు వర్చువల్ గానూ నేరుగానూ పెట్టి చేసిన దిశా నిర్దేశాల మేరకు ఎంత మంది పనిచేస్తున్నారు ఎంత మంది దారిలోకి వచ్చారు, మరెంత మంది ఇంకా మార్పు తెచ్చుకోలేక అలాగే ఉన్నారు అన్నది కూడా పార్టీ చాలా క్లోజ్ గా మోనిటరింగ్ చేస్తోంది అని అంటున్నారు.

**వారితోనే ఇబ్బంది :**

ఇక చాలా మంది ఎమ్మెల్యేలు ఇంకా దారిలోకి రాలేదని అంటున్నారు. పలు రకాలైన నివేదికలు పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన సమాచారం, నిఘా వర్గాల నుంచి వచ్చిన భోగట్టాలు అన్నీ కూలంకషంగా తరచి చూసిన మీదట పార్టీ ఇప్పటిదాకా చేసిన హెచ్చరికలు చాలు అనుకుంటోంది అని అంటున్నారు. ఎంతగా అప్రమత్తం చేసినా కూడా పట్టించుకోని వారి విషయంలో ఇక కఠినంగా ఉండాల్సిందే అన్నది హైకమాండ్ సీరియస్ గా ఆలోచిస్తోంది అని అంటున్నారు. ఇక వారిని అలా చూసీ చూడనట్లుగా వదిలేయాలని కొత్త నాయకత్వం ఆయా సీట్లలో ప్రోత్సహించాలని కూడా నిర్ణయించుకున్నట్లుగా చెబుతున్నారు.

**ప్రభుత్వ కార్యక్రమాల్లో :**

ఇక సామాజిక పెన్షన్లు ఏపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇస్తోంది. నెలకు నాలుగు వేల రూపాయలు అంటే మామూలు విషయం కాదు, అలాగే దివ్యాంగుల పెన్షన్ ఇతర కేటగిరీలలో చూస్తే పదిహేను వేల దాకా పెన్షన్ ఇస్తున్నారు. మరి వీటిని జనాలకు అందచేసే కార్యక్రమంలో చాలా మంది ఎమ్మెల్యేలు అయితే జనంలోకి రాకపోవడం పట్ల అయితే హైకామండ్ ఆగ్రహంగా ఉంది అని అంటున్నారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలలో ఉదాశీనత కొందరిలో ఎక్కువగా కనిపిస్తోంది అని అంటున్నారు. అలాగే ప్రభుత్వం చేసే అభివృద్ధి గురించి జనంలో ప్రచారం చేయకుండా సొంత పనుల్లో బిజీగా ఉండేవారి లెక్కను వన్ టైం తోనే సెటిల్ చేయాలని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఆల్టర్నేషన్ లీడర్ షిప్ ని అక్కడ డెవలప్ చేసి ఈ తరహా నిర్లక్ష్యం చేస్తున్న వారికి చెక్ పెట్టాలని నిర్ణయించుకున్నారు అని అంటున్నారు. ఉత్తరాంధ్రా గోదావరి కోస్తా రాయలసీమల్లో సమానంగానే ఈ వన్ టైం ఎమ్మెల్యేలు ఉన్నట్లుగా చెబుతున్నారు.

# జడ శ్రావణ్ తో జాగ్రత్త పడుతున్న జగన్!



**విజయవాడ, జూలై 2 పెన్ పవర్:**

ఏపీ రాజకీయాల్లో కుల ప్రభావం అధికంగా ఉంటుంది. కులాల వారీగా ఓట్లు చీలిపోతాయి కూడా. అలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సామాజిక వర్గం అండ ఉంటుంది. మరోవైపు దళిత క్రైస్తవ ఓటర్లు కూడా అటువైపే మొగ్గు చూపుతారు. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయం చవిచూసింది. కానీ దళిత క్రైస్తవులు మాత్రం ఆ పార్టీని ఆదరించారు. అయితే ఆ ఓటు బ్యాంకు పై తాజాగా గురి పెట్టారు జడ శ్రవణ్ కుమార్. గోదావరి జిల్లాలో దళిత క్రైస్తవ సభ పెట్టి.. మీరంతా జడ శ్రావణ్ తాలూకా అని చెప్పే రోజు వస్తుందని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ మాదిరిగా ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అవుతానని కూడా తేల్చి చెప్పారు. పనిలో పనిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై కూడా సున్నిత విమర్శలు చేశారు. దీంతో ఆ పార్టీలో అంతర్మధనం ప్రారంభం అయ్యింది. కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు జడ శ్రావణ్ కుమార్ సేవలను వాడుకోవాలని చూసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. సాక్షి మీడియాలో ఆయన ప్రెస్మీట్లకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతూ వస్తోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తో పాటు ప్రభుత్వాన్ని ఇరుక్కున పెట్టేలా జడ శ్రావణ్ కుమార్ వ్యాఖ్యలు నడిచేవి. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ శ్రావణ్ కుమార్ ను ఒక అస్త్రంగా మార్చుకోవాలని చూసింది. కానీ ఇప్పుడు అదే జడ శ్రవణ్ నేరుగా జగన్మోహన్ రెడ్డికి అత్యంత కీలకమైన దళిత క్రైస్తవ ఓటు బ్యాంకుకే ఎసరు పెట్టేలా ఉన్నారు. ఏలూరులో దళిత క్రైస్తవ సమర శంఖారావం బహిరంగ సభ నిర్వహించారు. అయితే ఇది కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సభ. కానీ వైసీపీని ఉలిక్కిపడేలా చేసేసారు శ్రావణ్ కుమార్. ఆకివీడు ఘటన నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు క్రైస్తవ మతాన్ని కించపరిచారని ప్రధాన అజెండాతో ఈ సభ నడిచింది. రఘురామకృష్ణం రాజును తీవ్రస్థాయిలో టార్గెట్ చేసిన జడ శ్రావణ్ కుమార్ ఈ సభ ద్వారా దళిత క్రైస్తవులను ఒక తాటిపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. తనను తాను అభినవ అంబేద్కర్ గా చూపించే ప్రయత్నం చేశారు. కేవలం వేదికలపై ఉపన్యాసాలకే పరిమితం కాకుండా.. ఇకపై రాష్ట్రంలోని దళిత క్రైస్తవులంతా పాము జడ శ్రావణ్ తాలూకా అని గర్వంగా చెప్పుకోవాలి అంటూ ఇచ్చిన పిలుపు వైసిపిలో సంచలనంగా మారుతుంది. ఆ పార్టీ నేతలు ఇప్పుడు శ్రావణ్ కుమార్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ ఓటు బ్యాంకు పైనే గురి పెడతారా అని ప్రశ్నిస్తున్నారు. తాము మీడియా మైలేజ్ ఇస్తూ.. పరోక్షంగా పాలు పోసి పెంచిన జడ శ్రావణ్.. ఇప్పుడు సొంత సామాజిక వర్గాలను చీల్చే ప్రయత్నం చేస్తుండడం పై వైసీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. జడ శ్రావణ్ కుమార్ నేరుగా ఈసారి తాను ఉప ముఖ్యమంత్రిని అవుతానని చెబుతున్నారు. అయితే అది ఎలా సాధ్యమో తెలియడం లేదు. కానీ అనవసరంగా జడ శ్రవణ్ కుమార్ ను హైలెట్ చేశామని వైసిపి నేతలు బాధపడుతున్నారు. ఇప్పుడు ఈ అంశంతో కూటమికి ప్రయోజనం చేకూర్చేలా ఉంది పరిస్థితి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకులో చీలిక వస్తే ఆ పార్టీకి దారుణ పరాజయం తప్పదు.. జడ శ్రావణ్ నిజంగా దళిత క్రైస్తవ ఓట్లను టార్గెట్ చేసుకుంటే ప్రతి నియోజకవర్గంలో వేలాది ఓట్లకు గండి పడవచ్చు వైసీపీకి. కూటమిని దెబ్బతీయడానికి వాడిన అస్త్రం ఇప్పుడు రివర్స్ తిరిగి జగన్ సొంత సామ్రాజ్యాన్ని దెబ్బతీసేలా ఉంది.

# ఆ 10 మంది ఎమ్మెల్యేలపై టీడీపీ సైలెంట్ యాక్షన్

**విజయవాడ, జూలై 2 పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటింది. అధికార తెలుగుదేశం పార్టీ లో అంతర్గత క్రమశిక్షణపై ఆ పార్టీ హైకమాండ్ అత్యంత కఠినమైన వైఖరిని అవలంబిస్తోంది. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన ఉత్సాహంలో కొందరు ఎమ్మెల్యేలు రూట్ మారుస్తూ, పార్టీ గీసిన లక్ష్మణ రేఖను దాటుతుండటంపై అధినేత నారా చంద్రబాబు నాయుడు సీరియస్ యాక్షన్‌కు దిగినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వివాదాస్పద వ్యాఖ్యలు, సొంత క్యాడర్‌తో విభేదాలు, పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్న కొందరు శాసనసభ్యులను హెచ్చరించడం మానేసి.. నేరుగా దూరం పెట్టే వ్యూహాన్ని టీడీపీ అమలు చేస్తోంది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మొదటి నుండి తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ప్రదర్శిస్తూ వచ్చారు. అయితే, ఇటీవల కాలంలో ఆయన పార్టీ హైకమాండ్ నిర్ణయాలను బహిరంగంగానే ధిక్కరిస్తూ, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. పార్టీ అధిష్ఠానం పలుమార్లు అంతర్గతంగా హెచ్చరించినప్పటికీ ఆయన తన వైఖరిని మార్చుకోలేదు. దీంతో టీడీపీ అగ్రనాయకత్వం ఆయనను పూర్తిగా పక్కనబెట్టేసింది. ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణను ఇప్పటికే ఇతర నేతలు చూస్తున్నారు. ఆయనను కేవలం పేరుకే ఎమ్మెల్యే అన్నట్లుగా మార్చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారికైనా ఇదే గతి పడుతుందనేందుకు కొలికపూడి ఎపిసోడ్ ఒక ఉదాహరణగా నిలిచింది. మరోవైపు సత్యవేడు ఎమ్మెల్యే కోనేరు ఆదిమూలం ప్రవర్తన కూడా పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. మహిళతో వివాదాస్పదంగా ప్రవర్తించి వార్తాల్లోకి ఎక్కిన ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆ వివాదం సెటిల్ చేసుకున్నా ఆయనను పార్టీలో కలుపుకోలేదు. అందుకే ఆయన కుమారుడు ఇటీవల ప్రెస్మీట్ పెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా టీడీపీ హైకమాండ్ పట్టించుకోవడం లేదు. సత్యవేడులో క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న పాత కార్యకర్తలు సైతం ఆయనను ఓన్ చేసుకోవడం లేదు. ఈ విషయాన్ని ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా, సోషల్ మీడియా ఫీడ్‌బ్యాక్ ద్వారా గ్రహించిన చంద్రబాబు.. సత్యవేడులో ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే పనులు జరిగేలా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని రంగంలోకి దించారు. తద్వారా క్యాడర్‌ను కాపాడుకుంటూనే, ఎమ్మెల్యేకు గట్టి షాక్ ఇచ్చారు. వలం ఈ ఇద్దరే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది మందికి పైగా ఎమ్మెల్యేల జాబితాను పార్టీ ఇంటెలిజెన్స్ వింగ్ సిద్ధం చేసింది. అధికారం అండతో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం, ఇసుక, భూ దందాల్లో తలదూర్చడం, కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగించకుండా వివాదాలు కొనితెచ్చుకోవడం వంటి నెగెటివ్ రిపోర్ట్స్ ఉన్న నేతలందరినీ ఈ లిస్టులో చేర్చారు. వీరిలో కొందరు ఉత్తరాంధ్ర, మరికొందరు రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు కూడా ఉన్నట్లుగా చెబుతున్నారు. గతంలో 2014-19 మధ్య కాలంలో కొందరు ఎమ్మెల్యేల మితిమీరిన ప్రవర్తన వల్లే పార్టీ 23 సీట్లకు పడిపోయిందనే చేదు నిజాన్ని చంద్రబాబు నాయుడు ఎప్పటికీ మర్చిపోలేదు. అందుకే, ఈసారి 135 కి పైగా సీట్ల భారీ మెజారిటీ ఉండటంతో.. ఒకరిద్దరు లేదా పది మంది ఎమ్మెల్యేలు దూరమైనా ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదనే ధీమాతో హైకమాండ్ ఉంది. వ్యవస్థ ముఖ్యం, ప్రజల్లో పార్టీ ఇమేజ్ ముఖ్యం..

అంతేకానీ దారి తప్పిన ఎమ్మెల్యేల కోసం పార్టీ ప్రతిష్టను పణంగా పెట్టలేం అని లోకేష్, చంద్రబాబు ఇద్దరూ అంతర్గత సమావేశాల్లో తెగేసి చెప్పారు. మారమని హెచ్చరించడం కంటే, వారిని పక్కనబెట్టి ప్రత్యామ్నాయ నేతలను తయారు చేయడం ద్వారా సదరు ఎమ్మెల్యేల పొగరు దించే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. టీడీపీ హైకమాండ్ తీసుకుంటున్న ఈ నిశ్శబ్ద అడుగులు.. సదరు వివాదాస్పద ఎమ్మెల్యేలకు భవిష్యత్తుపై పెద్ద హెచ్చరికగా మారాయి. ప్రస్తుతం వీరిని దూరం పెట్టడం అంటే.. వచ్చే ఎన్నికల్లో వీరికి టికెట్లు దక్కే ప్రసక్తే లేదనే సంకేతాన్ని క్యాడర్‌కు బలంగా పంపడమే. సోషల్ మీడియాలో కూడా ఈ ఐసోలేషన్ స్ట్రాటజీపై సామాన్య కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు తప్పు చేస్తే వెనకేసుకొచ్చే పాత రోజులు పోయాయని, పద్ధతి మార్చుకోకపోతే ఎంతటి సీనియర్ అయినా మాజీ అవ్వక తప్పదని టీడీపీ పంపుతున్న ఈ స్ట్రాంగ్ మెసేజ్.. మిగిలిన ఎమ్మెల్యేలను కూడా దారిలోకి తెస్తుందని భావిస్తున్నారు.

# నవంబర్ లో సీఐఐ సదస్సు

**విశాఖపట్టణం, జూలై 2 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త పంథాను ఎంచుకుంది. వచ్చే నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సన్నాహక సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ఈ సదస్సును గతానికి భిన్నంగా, వినూత్నంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈసారి భాగస్వామ్య సదస్సు కేవలం విశాఖపట్నానికే పరిమితం కాకుండా.. రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాలైన విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలలో ప్రాంతీయ భాగస్వామ్య సదస్సులు నిర్వహించాలని సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఎంఓయూలు , పెట్టుబడుల సంతకాలే ధ్యేయం కాకుండా.. అంతర్జాతీయ స్థాయి జ్ఞానాన్ని పంచుకోవడం మీద ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఈ సదస్సుల ద్వారా యువతలో సరికొత్త ఆలోచనలను రేకెత్తించాలని, టెక్నాలజీ రంగంలో గ్లోబల్ ఛాంపియన్లుగా ఎదిగేలా గైడెన్స్ ఇవ్వాలని సూచించారు. విదేశీ ప్రతినిధులతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఈ సదస్సుకు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ప్రాంతీయ స్థాయిలో నిర్వహించే ఈ సదస్సులలో స్టార్టప్ కంపెనీలకు, సరికొత్త ఆవిష్కరణలకు అగ్రతాంబూలం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆలోచనలకు ఈ వేదికలు ఊతమివ్వాలని.. నేటి తరం యువత భాగస్వామ్యాన్ని ఇందులో భారీగా పెంచాలని సూచించారు. ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశ, విదేశాల్లో భారీగా రోడ్ షోలు నిర్వహించనున్నారు. దేశీయంగా ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి నగరాల్లో రోడ్ షోలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాల పరిశ్రమలకు అనుకూలమైన అవకాశాలు ఉన్నాయో ముందే బేరీజు వేసుకుని.. ఆయా ప్రాంతీయ సదస్సులలోనే నిర్దిష్టమైన ఎంఓయూలు కుదుర్చుకునేలా ఏర్పాట్లు చేయాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. అలాగే, అమరావతిలో 'సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు. పారిశ్రామిక ప్రగతితో పాటు పబ్లిక్ పాలసీలు, భవిష్యత్ ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఈ సదస్సులో కీలక చర్చలు జరగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కేవలం పరిశ్రమలే కాకుండా వ్యవసాయం, ఉద్యానవన రంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ మరియు నేటి కార్పొరేట్ ప్రపంచానికి అవసరమైన 'స్ట్రెస్ ఫ్రీ వర్క్' వంటి వినూత్న అంశాలపై గ్లోబల్ నిపుణులు, ప్రముఖ యూనివర్సిటీల ప్రొఫెసర్లు చర్చించేలా ప్లాన్ చేయాలన్నారు.

# శంకుస్థాపనలతో సరా 19 ఏళ్లలో మూడోసారి

**కడప, జూలై 2 పెన్ పవర్:** వైఎస్సార్ కడప జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. జూలై 3న ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే, 2007 నుంచి ఇప్పటివరకు వరుసగా వచ్చిన ముఖ్యమంత్రులంతా శంకుస్థాపనల మీద శంకుస్థాపనలు చేస్తూనే ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఒక్క ఇటుక కూడా పడకపోవడంపై రాయలసీమ వాసుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి వేయబోయే పునాది రాయి అయినా ప్రాజెక్టు పూర్తికి దారితీస్తుందా.. లేక గత చరిత్ర పునరావృతమవుతుందా? అన్న సంశయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. కానీ, విభజన జరిగి పన్నెండేళ్లు గడుస్తున్నా.. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలతో పాటు కడప స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం ఇచ్చిన మాటను పూర్తిగా విస్మరించిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టడంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం చేతులెత్తేయడంతో, రాష్ట్ర ప్రభుత్వమే ఈ భారీ ప్రాజెక్టును మోయాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతోంది. కడప స్టీల్ ప్లాంట్ చరిత్రను గమనిస్తే.. ఇదొక శంకుస్థాపనల రికార్డుగా నిలిచిపోతుంది. 2007లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో జమ్మలమడుగు వద్ద మొదటిసారి శంకుస్థాపన చేశారు. అది ముందుకు సాగలేదు. విభజన తర్వాత 2018లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సున్నిపెంట వద్ద శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిన వెంటనే 2019 డిసెంబర్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కడప స్టీల్ ప్లాంట్‌కు మూడోసారి పునాది రాయి వేశారు. ఆయా కంపెనీల బోర్డులు మారడం, శంకుస్థాపనల శిలాఫలకాలు పడటమే తప్ప ప్రాజెక్టు మాత్రం అంగుళం కూడా ముందుకు కదల్లేదు. కడప స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వాల చిత్తశుద్ధిపై ప్రతిపక్షాలు మరియు ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. రాష్ట్రంలోకి వచ్చే ప్రైవేట్ స్టీల్ ప్రాజెక్టులకు మరియు ఇతర పారిశ్రామిక దిగ్గజాలకు వేల కోట్ల రూపాయల విలువైన భూములు, విద్యుత్, నీటి రాయితీలను గుమ్మరిస్తున్న పాలకులు.. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగాల్సిన కడప స్టీల్ ప్లాంట్‌కు మాత్రం నిధులు కేటాయించడంలో వెనుకాడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు జూలై 3న జరగబోయే శంకుస్థాపన అయినా రాయలసీమ నిరుద్యోగుల ఆశలను నిజం చేస్తుందో, లేక కేవలం ఎన్నికల, రాజకీయ ప్రచార అస్త్రంగానే మిగిలిపోతుందో కాలమే సమాధానం చెప్పాలి.

# వైసీపీ బలమైన స్థానాలే టార్గెట్...




**విశాఖపట్టణం, జూలై 2 పెన్ పవర్:** అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ పోటీ రోజురోజుకు మరింత ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా వచ్చే ఆంధ్రప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి పార్టీ తమ బలహీన, బలమైన ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గంగా భావించే అరకు ఇప్పుడు జనసేన పార్టీ వ్యూహాల్లో కీలక స్థానం సంపాదించిందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అరకు ప్రాంతంలో గత కొన్నేళ్లుగా వైసీపీకి బలమైన మద్దతు ఉంది. గిరిజన ఓటర్లలో ఆ పార్టీకి మంచి పట్టుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇప్పుడు అదే ప్రాంతంలో తన బలాన్ని పెంచుకోవాలని జనసేన భావిస్తున్నట్లు సమాచారం. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడం, స్థానిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ఆ పార్టీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అరకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం పొందుతోంది. కూటమి రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నియోజకవర్గంలో బలమైన నిర్మాణం అవసరమని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందుకే స్థానిక కార్యకర్తలను మరింత చురుకుగా పనిచేయాలని సూచనలు ఇస్తున్నారని చెబుతున్నారుఅరకు పార్లమెంట్ పరిధిలో గిరిజన సమస్యలు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలు ఎప్పుడూ ప్రధాన చర్చగా ఉంటాయి. ఈ సమస్యల పరిష్కారంపై ప్రజల్లో విశ్వాసం కల్పించగలిగితే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని జనసేన అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా తమ ప్రభావాన్ని పెంచుకోవాలని పార్టీ ప్రయత్నాలు చేస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక వైసీపీ కూడా తన బలమైన ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడానికి కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో లభించిన మద్దతును కొనసాగించేందుకు స్థానిక నాయకులు ప్రజలతో మరింత మమేకం అవుతున్నారని సమాచారం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా తమ ఆధిక్యాన్ని కొనసాగించాలని ఆ పార్టీ ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అరకు రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన పార్టీలతో పాటు కూటమి వ్యూహాలు కూడా ఈ ప్రాంత ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తే అరకు నియోజకవర్గంలో పోటీ గతంతో పోలిస్తే మరింత ఉత్కంఠభరితంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలు, ఎన్నికల నాటికి మారే రాజకీయ పరిస్థితులు కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశాలుగా ఉంటాయి. అందుకే ఇప్పటి నుంచే అన్ని పార్టీలు తమ తమ వ్యూహాలను అమలు చేస్తూ ప్రజల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అరకు వంటి కీలక ప్రాంతాల్లో రాజకీయ పోటీ మరింత ఆసక్తికరంగా మారుతుండటంతో రానున్న రోజుల్లో అక్కడి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## మానవ అవయవాల అక్రమ వ్యాపారం.. ప్లాసెంటా స్మగ్లింగ్ కేసు సంచలనం!



అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాలు కేవలం డ్రగ్స్, బంగారం మాత్రమే కాదు.. ఏకంగా మానవ అవయవాలను కూడా అక్రమంగా రవాణా చేస్తున్నాయనే షాకింగ్ నిజం ఇప్పుడు బయటపడింది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో విస్తుపోయే రేంజ్‌లో సాగుతున్న ఒక అంతర్జాతీయ ప్లాసెంటా రాకెట్ గుట్టును అక్కడి అధికారులు రట్టు చేశారు. వైద్య చరిత్రలోనే ఇలాంటి ఒక అవయవాల అక్రమ రవాణా దందా బయటపడటం ఇదే మొదటిసారి కావడంతో ప్రపంచవ్యాప్తంగా ఈ వార్త పెద్ద సంచలనం సృష్టిస్తోంది.

గొర్రె మాంసం పేరుతో మోసం చేసిన విషయం, పాకిస్తాన్‌కు చెందిన ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. ఈ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా ఏకంగా 500 కేజీల బరువున్న మానవ ప్లాసెంటాను అంటే రక్తపిండం లేదా మాయ అంటారు ఒక చోట సేకరించింది. అయితే విదేశాలకు తరలించేటప్పుడు ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు.. అది గొర్రెల ప్లాసెంటా అని నమ్మిస్తూ పేపర్లు సృష్టించి బోర్డర్ దాటించడానికి ప్లాన్ చేశారు. అయితే అధికారులు ముందుగానే ప్లాన్ చేసి, ఈ ముఠాను అక్కడికక్కడే పట్టేశారు.

**ఆసుపత్రుల నుండి తక్కువ ధరకు కొనుగోలు:**

ఈ ముఠాకు స్థానిక ఆసుపత్రుల్లోని కొందరు సిబ్బందితో లింకులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. గర్భిణీ స్త్రీలు డెలివరీ అయిన తర్వాత పారేసే ప్లాసెంటాను ఈ కేటుగాళ్లు ఆసుపత్రుల నుండి చాలా తక్కువ ధరకు గుట్టుచప్పుడు కాకుండా కొనుగోలు చేసేవారు. ఇక అలా సిటీలోని రకరకాల హాస్పిటల్స్ నుండి వందల కేజీల ప్లాసెంటాను సేకరించి, కోల్డ్ స్టోరేజ్‌లలో దాచి ఉంచి విదేశాలకు స్మగ్లింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

**మెడిసిన్స్, బ్యూటీ ప్రొడక్ట్స్ కోసం వాడకం:**

అసలు ఈ మానవ ప్లాసెంటాను విదేశాలకు ఎందుకు పంపుతున్నారనే దానికి షాకింగ్ కారణాలు తెలిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో దీనికి భారీ డిమాండ్ ఉందట. ఇక ముఖ్యంగా కొన్ని రకాల ఖరీదైన ఔషధాల తయారీలోనూ, అలాగే యాంటీ ఏజింగ్ సౌందర్య సాధనాలు, కాస్మోటిక్స్ తయారీలో ఈ మానవ ప్లాసెంటాను విరివిగా వాడుతున్నట్లు విచారణలో తేలింది.

**చైనాలో వండుకుని తింటున్నారు:**

ఈ దర్యాప్తులో అన్నింటికంటే దారుణమైన విషయం మరొకటి బయటపడింది. ఈ ప్లాసెంటాను ఎక్కువగా చైనా వంటి దేశాలకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. చైనాలోని కొందరు సంపన్న వర్గాల వారు ఈ మానవ ప్లాసెంటా తింటే ఆరోగ్యం, యవ్వనం లభిస్తాయని నమ్ముతూ.. దీనిని ప్రత్యేకంగా వండుకుని తింటున్నారనే చేదు నిజం తెలిసి అధికారులు సైతం ముక్కున వేలేసుకున్నారు.

డబ్బు కోసం మనుషులు ఎంతకైనా దిగజారుతారనే దానికి ఈ ప్లాసెంటా స్మగ్లింగ్ కేసే పెద్ద ఉదాహరణ. హాస్పిటల్స్ లో వేస్ట్ గా పారేసే భాగాలను కూడా ఇలా కోట్లలో బిజినెస్ చేయడానికి వాడుకోవడం నిజంగా ఘోరం. ఇక ఈ కేసు తర్వాతైనా అన్ని దేశాల ప్రభుత్వాలు ఆసుపత్రుల వేస్ట్ మేనేజ్మెంట్ పై నిఘా పెంచాలని, ఇలాంటి ముఠాలకు కఠిన శిక్షలు పడేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## జగన్ మావిగన్... విశాఖ సంగతేంటి ?

విశాఖ మన రాజధాని అని వైసీపీ అధినేత జగన్ గతంలో చెప్పారు. తాను 2024లో మరోసారి గెలిస్తే విశాఖ నుంచే ప్రమాణం చేస్తాను అని కూడా చెప్పారు. విశాఖలో అన్నీ ఉన్నాయి అది సహజసిద్ధమైన రాజధాని అని వైసీపీ నేతలు పలు మార్లు చెప్పుకొచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో చేదు ఫలితాలు దక్కిన తరువాత కానీ వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని అంటున్నారు. అందుకే కొన్నాళ్ళ పాటు సైలెంట్ గా ఉండి ఇపుడు దాదాపుగా టీడీపీ రూట్లోనే వెళ్తున్నారు అని అంటున్నారు. టీడీపీ కూడా అమరావతి రాజధాని అన్నది. విజయవాడ గుంటూరులకు దూరంగా కొత్త నగరం నిర్మించే పనిలో టీడీపీ ఉంది. అయితే వైసీపీ మాత్రం రెడీ మేడ్ గా మావిగన్ అని అంటోంది. అంటే విశాఖకు బదులుగా మావిగన్ తెచ్చినా రెడీ మేడ్ సిటీ విషయంలో మాత్రం వైసీపీ పక్కకు జరగలేదు అన్నది స్పష్టం అవుతోంది.

**ఓఆశ పెట్టింది ఎవరు :**

ఇక విశాఖ రాజధాని అన్నారు. బీచ్ రోడ్డులో రుషికొండ మీద టూరిజం రిసార్ట్స్ ని తొలగించి అక్కడ సీఎం క్యాంప్ ఆఫీసు అని నివాసం అని దాని పేరుతో భారీ భవనాలు కట్టారు. నాలుగు వందల కోట్ల రూపాయలు దాని కోసం ఖర్చు చేశారు. విశాఖలో సముద్రం ఉంది, రైల్ రోడ్డు ఎయిర్ కనెక్టివిటీ ఉందని కూడా చెప్పారు. ఉత్తరాంధ్రా వెనకబాటుతనం అంతా పోయేలా విశాఖ క్యాపిటల్ ద్వారా అభివృద్ధి సాగుతుందని కూడా ప్రకటించారు. కానీ ఇపుడు విశాఖను వెనక్కి తీసుకున్నారు. ఆశ పెట్టి తగ్గిపోయారు అని అంటున్నారు. మరి దీని మీద ఉత్తరాంధ్రా వైసీపీ నేతల రియాక్షన్ ఎలా ఉంటుంది అన్నది కూడా చర్చకు వస్తోంది.

**మా ప్రాంతం బాగుపడొద్దా :**

ఇక విశాఖ రాజధాని అన్నపుడు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి వారు గట్టిగా సమర్ధించారు. మా ప్రాంతం బాగు పడవద్దా అని కూడా ప్రశ్నించారు. మాకు రాజధాని వస్తూంటే టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు అని కూడా విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అలాగే బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా విశాఖ రాజధానికి జై కొట్టారు. మరి ఇపుడు వైసీపీ అయితే మావిగన్ అని తన రూట్ మార్చి ప్లేట్ తిప్పేసింది. దాంతో ఈ మాజీ మంత్రులు ఇంకా వైసీపీలోని కీలక నేతలు సీనియర్ నేతలు ఏమంటారు అని ప్రశ్నలు వస్తున్నాయి.

**అసలైందే కరవు అందుకే :**

అయితే మైసూర్ పాక్ లో మైసూర్ లేదని సెటైర్ ఉంది. అలాగే విశాఖ రాజధాని అని వైసీపీ నేతలు ఎంత గట్టిగా చెప్పినా మరెంత ఆర్భాటం చేసినా జనాల మద్దతు అయితే ఏ కోశానా లేదని తేలిపోయింది. విశాఖ రాజధాని అన్న తరువాతనే 2023లో ఉత్తరాంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ప్రజలు యువత ఉద్యోగులు విద్యావంతులు అంతా కలసి టీడీపీకే ఓటేశారు. ఆ తరువాత 2024లో విశాఖ జిల్లా మొత్తం ఒక్క సీటూ వైసీపీకి లేకుండా చేశారు. ఇంతే కాదు గత అయిదేళ్లలో వైసీపీ విశాఖ రాజధాని అని ఎంతగా చెప్పినా జనాల నుంచి పాజిటివ్ రియాక్షన్ అయితే పెద్దగా రాలేదని గుర్తు చేస్తున్నారు. అందుకే వైసీపీ కూడా తన నిర్ణయం మార్చేసుకుంది అని అంటున్నారు. అయితే చెప్పుకోవడానికి ఈ రీజన్ బాగుంది కానె విశాఖ సహా ఉత్తరాంధ్రా అభివృద్ధి మీద వైసీపీ చిత్తశుద్ధి ఇంతేనా అన్న చర్చ కూడా మరో వైపు సాగుతోంది. మరి వైసీపీ ఏ విధంగా దీని మీద జనాలకు చెప్పుకుంటుందో చూడాల్సి ఉంది.

## వాట్సాప్ తర్వాత టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకు కూడా ప్రభుత్వం షాక్ ఇస్తుందా..?



మొబైల్ నెంబర్ హైడ్ చేసి.. కేవలం యూజర్ నేమ్ ద్వారానే యూజ్ చేసే విధంగా వాట్సాప్ కొత్త ఫీచర్ తీసుకొస్తున్న విషయం తెలిసిందే. అయితే యూజర్ నేమ్ ద్వారా ప్రైవసీ, సెక్యూరిటీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కేంద్రం మెటాకు నోటీసులు పంపింది. కొన్నాళ్లు ఈ నిర్ణయాన్ని హోల్డ్ లో పెట్టింది. అయితే ఇప్పుడు వాట్సాప్ మాత్రమే కాకుండా మరిన్ని కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం షాకి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై దాని పేరెంట్ కంపెనీ మెటా కి నోటీసు ఇచ్చిన తర్వాత, ఇప్పుడు టెలిగ్రామ్, సిగ్నల్ వంటి ఇతర మెసేజింగ్ యాప్‌లపై కూడా కేంద్ర ప్రభుత్వం ఫోకస్ చేస్తోంది. ఈ యాప్‌లలోని యూజర్‌నేమ్ ఫీచర్‌పై త్వరలో నోటీసులు జారీ చేసి వివరణ కోరనున్నట్లు తెలుస్తోంది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. యూజర్‌నేమ్ ఫీచర్ వల్ల ఇంపర్సనేషన్ (వ్యక్తులను అనుకరించడం), ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ స్కాములు పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌ను ప్రారంభించకుండా నిలిపివేయాలని, మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని మెటాకు ఇప్పటికే నోటీసు ఇచ్చింది . ఇదే విధంగా టెలిగ్రామ్, సిగ్నల్ నుంచి కూడా భద్రతా ప్రమాణాలు, యూజర్ గుర్తింపు విధానాలు, మిస్ యూజ్ అయ్యే అవకాశాలపై వివరణ కోరనుంది.

**ఎందుకు ఈ నిర్ణయం?**

యూజర్‌నేమ్ ఫీచర్ ద్వారా ఫోన్ నంబర్ షేర్ చేయకుండానే సందేశాలు పంపవచ్చు. ఇది ప్రైవసీని పెంచుతుందని యాప్‌లు చెబుతున్నా, దీన్ని దుర్వినియోగం చేసి మోసాలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రముఖ వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వ ఖాతాలను ఫాలో అవుతూ మోసాలు జరగవచ్చని ప్రభుత్వం నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అయితే ఈ ఫీచర్ ఇంకా లైవ్ కాలేదని, ఈ ఏడాది చివర్లో నెమ్మదిగా అందుబాటులోకి వస్తుందని వాట్సాప్ క్లారిటీ ఇచ్చింది. ఇంపర్సనేషన్‌ను అడ్డుకోవడానికి అనేక సేఫ్‌గార్డ్స్ ఉంచామని వాట్సాప్ ప్రతినిధి ఒకరు చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వం సంతృప్తి చెందే వరకు ఫీచర్‌ను రోల్ అవుట్ చేయవద్దని భావిస్తున్నట్లు స్పష్టం చేసింది. భారతదేశం వాట్సాప్‌కు అతిపెద్ద మార్కెట్ కావడం, 50 కోట్లకు పైగా యూజర్లు ఉండటం ఇక్కడ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఫీచర్ సైబర్ నేరాలను పెంచే అవకాశం ఉంటే IT Act కింద చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

## పెట్రోల్ రేట్లు తగ్గుతాయా లేదా : కేంద్ర మంత్రి సమాధానం ఇదే



అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధంకారణంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన విషయం తెలిసిందే.. అయితే యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.. దీంతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి తెరుచుకోవడంతో ముడి చమురు ధరలు తగ్గి యుద్ధానికి ముందున్న పాత ధరలకు చేరాయి. ఈ క్రమంలో మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం శాఖ కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్ , డీజిల్ ధరల తగ్గింపుపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న పెట్రోల్ ధరలు అమెరికా, ఇరాన్ యుద్ధానికి ముందు అంటే రెండు నెలల క్రితం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నిర్ణయించాం..

ఇప్పుడు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడంతో ముడి చమురు ధరలు కూడా తగ్గాయి. గతంలో నిర్ణయించిన రేట్లతో ముడి చమురు కొనుగోలు చేశాం.. పరిస్థితి ఇలాగే కొనసాగితే పెట్రోల్ ధరల తగ్గింపు సమీక్షిస్తామని అన్నారు. పశ్చిమాసియాలో ఘర్షణల సమయంలో కొనుగోలు చేసిన ముడి చమురును ఆయిల్ కంపెనీలు ఇప్పటికీ శుద్ధి చేసి విక్రయిస్తున్నాయి. అందువల్ల ముడి చమురు ధరల తగ్గుదల ఇంకా రిటైల్ ఇంధన ధరల తగ్గుదలకు రాలేదని పెట్రోలియం మంత్రి చెప్పారు. జూన్ 30 వరకు పెట్రోల్, డీజిల్,ఎల్ పీజీ ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరకు విక్రయించడంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రూ.74వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయని మంత్రి అన్నారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రిటైల్ ఇంధన ధరలు లీటరకు రూ.7.50 లు పెరిగాయి. ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గించింది.. ఆ తర్వాత రిటైల్ ధరలు పెంచేందుకు అనుమతించామన్నారు.

## చిన్నారులపై అమానుషం... డేకేర్ ఘటనతో తల్లిదండ్రుల్లో ఆందోళన!

కన్నబిడ్డలను నమ్మి డేకేర్ సెంటర్లలో వదిలి వెళ్తున్న తల్లిదండ్రుల గుండెలు గుభేల్‌మనే షాకింగ్ ఘటన బెంగళూరులో వెలుగుచూసింది. ఏం జరుగుతుందో అర్థం కాని చిన్నారులపై డేకేర్ స్టాఫ్ చేసిన క్రూరత్వం వీడియోల రూపంలో బయటపడటంతో దేశమంతా షాక్‌కు గురైంది. పసివాళ్లని కూడా చూడకుండా సిబ్బంది ప్రవర్తించిన తీరుపై ప్రతి ఒక్కరూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోరమైన ఉదంతం ఇప్పుడు ఉద్యోగాలు చేసే తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది.

**వాషింగ్ మెషీన్‌లో పెట్టి హింసలు:**

బెంగళూరులోని ఉన్న ఒక డే కేర్ సెంటర్ లో ఈ అమానుషం జరిగింది. అక్కడ పనిచేసే కేర్ ఆయాలు 2 నుంచి 3 ఏళ్ల వయసున్న పసిపిల్లలను బలవంతంగా ఫ్రంట్ లోడింగ్ వాషింగ్ మెషిన్ లోపల, పైభాగాన ఉంచారు. అంతటితో ఆగకుండా టాయిలెట్ జెట్ స్ప్రేతో పసిపిల్లల మొహాలపై, నోటిలో నీళ్లు కొడుతూ పైశాచిక ఆనందం పొందారు.

**బాత్‌రూమ్‌లో వేసి తాళం:**

సిబ్బంది చేసిన ఈ దారుణమైన పనికి భయపడిపోయిన చిన్నారులు భోరున ఏడవడం ప్రారంభించారు. కనీసం జాలి కూడా లేకుండా ఆ ఏడుస్తున్న పిల్లలందరినీ తీసుకెళ్లి బాత్‌రూమ్‌లో పడేసి బయటనుంచి తాళం వేశారు. ఇక ఈ దారుణానికి సంబంధించిన సీసీటీవీ విజువల్స్ బయటకు రావడంతోనే ఈ నరకం గురించి లోకానికి తెలిసింది. పిల్లలను డేకేర్‌లో వేసి ఆఫీసులకు వెళ్లే పేరెంట్స్ ఈ వీడియోలు చూసి కన్నీరుమున్నీరవుతున్నారు.

**ఐదుగురు మహిళలపై ఎఫ్ఐఆర్:**

ఈ షాకింగ్ ఘటనపై సమాచారం అందుకున్న బెంగళూరు పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కేసు నమోదు చేశారు. ఇక ఈ అకృత్యానికి ఒడిగట్టిన ఐదుగురు మహిళా సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టారు. బాధితులైన తల్లిదండ్రుల స్టేట్‌మెంట్స్ రికార్డ్ చేస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

**రంగంలోకి బాలల హక్కుల కమిషన్:**

ఈ దారుణమైన ఘటన కర్ణాటక స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ దృష్టికి కూడా వెళ్ళింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కమిషన్, వెంటనే పూర్తి వివరాలతో కూడిన రిపోర్టును

సమర్పించాలని అధికారులను ఆదేశించింది. చిన్నారులపై ఇలాంటి క్రూరత్వం చూపే సెంటర్స్ కఠిన చర్యలు తీసుకుని, లైసెన్సులు రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన డేకేర్ సెంటర్లలోనే ఇలాంటి మృగాలు ఉండటం సమాజానికే సిగ్గుచేటు. కేవలం డబ్బుల కోసం కాకుండా, సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందో డేకేర్ యాజమాన్యం, తల్లిదండ్రులు నిరంతరం గమనించాలి. ఇక ఈ కేసులో నిందితులకు కోర్టులు కఠినమైన శిక్ష విధిస్తేనే.. భవిష్యత్తులో ఇలాంటి పనులు చేయడానికి ఎవరికైనా వణుకు పుడుతుంది.

## గ్లోబల్ వార్మింగ్‌కు కొత్త సమాధానం... చైనా స్మార్ట్ కూలింగ్ టెక్నాలజీ!



ప్రపంచవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి, హీట్ వేవ్స్ జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇలాంటి టైంలో గ్లోబల్ వార్మింగ్‌కు, భానుడి భగభగలకు చెక్ పెట్టేలా చైనా సరికొత్త టెక్నాలజీని వాడుకలోకి తెచ్చింది. ఇది కృత్రిమ వర్షం కాదు కానీ, ఎండ వేడిని ఇట్టే తగ్గించేసే ఒక అద్భుతమైన ఐడియా. చైనాలోని ఒక ప్రాంతంలో బిల్డింగ్‌లపై అమర్చిన ఈ స్మార్ట్ కూలింగ్ సిస్టమ్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

**బిల్డింగ్‌లపై సరికొత్త మిస్ట్ కూలింగ్ సిస్టమ్:**

చైనాలోని 'షాంక్సీ' రీజియన్‌లోని ఒక రెసిడెన్షియల్ కమ్యూనిటీలో ఈ లేటెస్ట్ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా ఇన్‌స్టాల్ చేశారు. దీన్ని 'మిస్ట్ కూలింగ్ సిస్టమ్' అని పిలుస్తున్నారు. ఇక ఈ టెక్నాలజీ ద్వారా బిల్డింగ్‌ల పైకప్పుల నుండి గాల్లోకి అత్యంత సూక్ష్మమైన నీటి బిందువులను స్ప్రే చేస్తారు. ఇవి గాల్లోకి రాగానే ఎండ వేడికి ఆవిరిగా మారిపోతాయి.

**ఐదు నిమిషాల్లో 8 డిగ్రీల ఉష్ణోగ్రత డౌన్:**

ఈ సిస్టమ్ పని చేయడం మొదలుపెట్టిన కేవలం కొద్ది నిమిషాల్లోనే అద్భుతమైన మార్పు కనిపిస్తుంది. బిల్డింగ్ చుట్టుపక్కల ఉన్న వేడి వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. పరిసరాల ఉష్ణోగ్రత ఏకంగా 5 నుండి 8 డిగ్రీల వరకు పడిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇక అంటే ఎండలో నిలబడిన వారికి కూడా క్షణాల్లో ఏసీ ఆన్ చేసినట్లుగా చల్లటి అనుభూతి కలుగుతుందన్నమాట.

**పబ్లిక్ ప్లేసెస్ టార్గెట్‌గా డిజైన్:**

వేసవి కాలంలో మరియు ఎండలు ఎక్కువగా ఉండే రోజుల్లో ప్రజలు ఎక్కువగా తిరిగే పబ్లిక్ ప్లేసెస్, పార్కులు, కాలనీలను చల్లబరచడానికి ఈ టెక్నాలజీని ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఇక దీనివల్ల ఇళ్లల్లో, ఆఫీసుల్లో విపరీతంగా వాడే ఎయిర్ కండిషనర్ల వినియోగం కూడా చాలా వరకు తగ్గుతుంది. ఫలితంగా కరెంట్ ఆదాతో పాటు పర్యావరణానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది.

**ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ఆసక్తి:**

ప్రస్తుతం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరాల్లో గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఉష్ణోగ్రతలు ప్రమాదకరంగా పెరిగిపోతున్నాయి. ఇక ఈ క్రమంలో చైనా తీసుకొచ్చిన ఈ ఇన్నోవేటివ్ మోడల్ టెక్నాలజీ ఎండలను తట్టుకోవడానికి ఒక మంచి ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. ఇక దీంతో భారత్ సహా పలు దేశాలు కూడా తమ నగరాల్లో ఇలాంటి సిస్టమ్స్ ఏర్పాటు చేయడంపై ఆసక్తి చూపిస్తున్నాయి. ఎండల తీవ్రతను తట్టుకోవడానికి కేవలం ఇళ్లల్లో ఏసీలు వేసుకుని కూర్చుంటే సరిపోదు, పర్యావరణాన్ని కూడా కాపాడుకోవాలని చైనా ఈ సరికొత్త టెక్నాలజీతో నిరూపించింది. ఇక ఖర్చు తక్కువతో, కాలుష్యం లేకుండా చుట్టుపక్కల వాతావరణాన్ని చల్లబరిచే ఇలాంటి స్మార్ట్ కూలింగ్ సిస్టమ్స్ మన దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా వస్తే రాబోయే రోజుల్లో ఎండ దెబ్బ నుండి సామాన్యులను కాపాడుకోవచ్చు..

మనం ఆనకట్టలు కట్టాం, చట్టాలు చేశాం, నదుల శుద్ధి కార్యక్రమాలు చేపట్టాం.. అయినా నదులు చచ్చిపోతున్నాయి. చెరువులు చిన్నబోతున్నాయి. భూగర్భ జలాలు అంతర్ధానమవుతున్నాయి. ఒక నిజం మనల్ని ఇప్పుడు ఆందోళనలో ముంచుతోంది. బహుశా మనం తప్పు సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాం. నీరు కేవలం క్షీణిస్తున్న వనరు మాత్రమే కాదు, అదొక దర్పణం. మనిషిగా ఎంతదూరం దిగజారిపోయామో స్పష్టంగా చూపించే దర్పణం. గాలి, నీరు, సూర్యకాంతి -ఈ మూడూ మన జీవితానికి అవసరమని అందరికీ తెలుసు. అవి లేకుండా జీవితం ఉండదనీ తెలుసు. ప్రకృతి అందించిన పంచభూతాల్లో నీరు అత్యంత మూలాధారమనీ తెలుసు. శాస్త్రవేత్తలు ఇతర గ్రహాల్లో జీవముందా? అని వెతికేటప్పుడు ముందు నీటి ఆనవాలు వెతుకుతారు. ఎందుకంటే నీరంటే జీవం, జీవమంటే నీరు! భూమి ఉపరితలంలో 70 శాతం నీటితో నిండి ఉంది కాబట్టే ఇంత వైవిధ్యభరితమైన జీవ సమూహాలు మనుగడ సాగిస్తున్నాయి. నీటి చక్రం (వాటర్ సైకిల్) ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన వ్యవస్థ. సముద్రపు ఉప్పు నీటిని వర్షం, మంచురూపంలో మంచి నీటిగా మారుస్తుంది. నిప్పు తాకిన ప్రతిదాన్నీ దహిస్తుంది; కానీ నీరు తనలో కరిగే మలినాలతో తానే కలుషితమవుతుంది. ఇదే నీటిని మానవ ఆత్మకు అత్యంత సరైన ప్రతీకగా నిలిపే అంశం. నీటిలాగే మానవ ఆత్మ కూడా అత్యంత సున్నితమైనది, తాను నివసించే పరిసరాల ప్రభావానికి సులభంగా లోనయ్యేది. అనుకూల వాతావరణంలో దైవంగా వెలిగే సామర్థ్యం, ప్రతికూల వాతావరణంలో అసురత్వంగా మారే ప్రమాదం -రెండూ ఒకే ఆత్మలో నిద్రిస్తాయి. సత్యయుగంలో మానవ ఆత్మలు పరిపూర్ణంగా నిర్మలంగా ఉన్నప్పుడు -ఆలోచనలు, మాటలు, చేతలు అన్నీ అత్యున్నత నైతిక సూత్రాల మేరకు ఉన్నప్పుడు.. ప్రకృతి కూడా సహజంగా సమతులంగా ఉండింది. నదులు తమ గట్లు దాటలేదు. వర్షాలు భూమిని ముంచెత్తలేదు. సూర్యుడు, గాలి, మట్టి వినాశనం కాకుండా సమృద్ధిగా ఇచ్చాయి. ఆ సమతుల్యత యాదృచ్ఛికం కాదు, అది ప్రకృతిపై నేరుగా ప్రభావం చప్రించిన మానవ చైతన్యం!


అయితే మానవుడిలో అహంకారం, దురాశ పెరిగేకొద్దీ ప్రకృతి నైసర్గిక క్రమం దెబ్బతినసాగింది. మానసిక పతనం పర్యావరణ విధ్వంసంగా మారింది. అడవుల నరికివేత, పరిశ్రమల విష వ్యర్థాల విడుదల, అనియంత్రిత వినిమయవాదం, అదుపులేని జనాభా వృద్ధి.. ఇవన్నీ కలిసి విధ్వంసకరమైన అసమతుల్యతను సృష్టించాయి. కానీ ఇవి లక్షణాలు మాత్రమే. అసలు వ్యాధి లోపల ఉంది. విలువల క్రమంగా క్షీణించడం, మనస్సాక్షి మొద్దుబారడం, మనకంటే పెద్దదైన ఏదో ఒకదానికి బాధ్యత వహించే స్పృహ తొలగిపోవడం లాంటిది. మనం ఎప్పుడైనా భూమాతపట్ల కృతజ్ఞత వ్యక్తం చేశామా? పుట్టిన నాటినుంచి ఇప్పటి వరకు ఉచితంగా గాలి, నీరు, ఆహారం, సూర్యకాంతి ఇస్తూనే ఉన్న ఆమెకు ఒక్కసారైనా కృతజ్ఞత చెప్పామా? మనం ఆమెకు చేసిన హానికి క్షమాపణ అడిగామా? భారతదేశంలో ఇప్పుడు పరిస్థితి తీవ్రంగా ఉంది. చాలా ప్రాంతాల్లో ప్రజలకు శుద్ధమైన తాగు నీరు అందడం లేదు. ఇది జీవావసరాల్లో అతి ప్రాథమికమైనది. నీటి కొరతవల్ల అల్లర్లు జరుగుతున్నాయి. నదీ జలాల పంపిణీ వివాదాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు చట్టపు పోరాటాలు చేస్తున్నాయి.

## అంతరంగ జలం!

ఇప్పటికే భారత జనాభాలో 60 కోట్లకు పైగా ప్రజలు అధిక నీటి ఒత్తిడి ఉన్న ప్రాంతాల్లో జీవిస్తున్నారు. 2030నాటికి దేశంలో నీటి డిమాండ్ అందుబాటు కంటే రెండింతలు పెరుగుతుందని అంచనాలు చెబుతున్నాయి. ఆనకట్టలు కట్టే ఇంజనీర్లు, జల సంరక్షణ చట్టాలు చేసే శాసనకర్తలు, నదీ శుద్ధి పథకాలు రూపొందించే పాలకులు -వీళ్ళందరి కృషి అవసరమే; కానీ తగినంతగా చాలదు. ఇవాళ మనల్ని హెచ్చరిస్తున్న ప్రకృతి విపత్తులు (వరదలు, కరువులు, భూకంపాలు) కేవలం వాతావరణ మార్పుల ఫలితాలు మాత్రమే కాదు, మనం మన శక్తులన్నింటినీ ఎక్కడ వ్యయం చేస్తున్నామో తెలుసుకోమని ప్రకృతి ఇస్తున్న మేల్కొలుపు సంకేతాలు.

జలం అంటే కేవలం హెచ్2వో కాదు, అదొక జీవశక్తి, ఒక చికిత్సా సాధనం, ఒక పవిత్రమైన ఉనికి. కానీ ఆ సామర్థ్యం నెరవేరాలంటే మనం దాన్ని, మనల్ని మనం నిర్మలంగా ఉంచుకోవాలి. కలుషితమైన మనస్సు తన చుట్టూ ఉన్న పరిసరాలను కలుషితం చేయడానికి ఏదోక మార్గం వెతుకుతుంది, ఇది సత్యం. దీనికి విలోమం కూడా అంతే సత్యం.. విలువలతో జీవించే, చైతన్యంగా ఉండే మనిషి తన జీవాన్ని నిలిపే ప్రతిదాన్నీ సహజంగా రక్షిస్తాడు. పరిష్కారం అవసరం అయిన సమస్య ఏమిటంటే, నీటిలో కలిసిన మురికి మాత్రమే కాదు.. మనస్సులో పేరుకున్న మురికి కూడా. ఆనకట్టలకు మరమ్మతులు చేయడం అవసరమే; కానీ మనస్సాక్షికి మరమ్మతు చేయడం మరింత అవసరం. కొండల్లో నీటి వనరులను తవ్వడం అవసరమే; కానీ హృదయంలో కృతజ్ఞతను తవ్వడం మరింత అవసరం. ఒక్కొక్కరు రోజూ కొంత సమయం ప్రార్థనలో, ధ్యానంలో గడపడం, సానుకూల ఆలోచనలతో తమ అంతరంగాన్ని శుభ్రపరచుకోవడం.. ఇది చేయగలిగే అత్యంత సరళమైన, ప్రభావవంతమైన పర్యావరణ సంరక్షణ చర్య. నీరు భూమిపై జీవానికి మూలం అయినట్లే, మానవ చైతన్యం నాగరికతకు మూలం. ఆ మూలాన్ని శుద్ధంగా ఉంచుకున్నప్పుడే నదులు, చెరువులు, భూగర్భ జలాలు శుద్ధంగా ఉంటాయి. లేకుంటే, ఎన్ని ఆనకట్టలు కట్టినా, ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా.. నలుపు తెరపై తెలుపు రాసినట్లే, ఆ మార్పు శాశ్వతం కాదు! నీటి సంక్షోభాన్ని పరిష్కరించడానికి మనం ముందుగా మనిషిని మార్చాలి. అది మనలో మనమే మొదలుపెట్టాలి. నీటి సంరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు.. ఇది ప్రతి వ్యక్తి అంతరంగ బాధ్యత. మనం ఒక్కో చుక్క నీటిని వృథా చేసేటప్పుడు, ఒక్కో కాలువను కలుషితం చేసేటప్పుడు.. మన ఆత్మలో ఒక్కో విలువను చంపుకుంటున్నాం. జలం మనకు జీవమిచ్చింది; ఇప్పుడు మనం దానికి జీవం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. రేపటి తరానికి నదులు, చెరువులు, భూగర్భ జలాలు అందించాలంటే.. నేడు మన మనస్సులను నిర్మలంగా మార్చుకోవడం తప్పనిసరి. అంతరంగం మారితే అవతలం మారుతుంది. మనిషి మారితే ప్రకృతి మారుతుంది.. ఇదే జలం మనకు నేర్పుతున్న శాశ్వత సత్యం! నీటి చుక్కను కాపాడటమంటే భవిష్యత్తును కాపాడటం. ఆ చుక్కలోనే మన మనుగడ ఉంది. మన నాగరికత ఉంది. మన మానవత్వం ఉంది. అదే -అంతరంగ జలం!!

### పనికొచ్చే మాట



## మీ దృక్పథమే మీ సక్సెస్ రూట్

జీవితంలో సవాళ్లు, ఆటంకాలు ఎదురైనప్పుడు చాలామంది నిరాశకు లోనవుతుంటారు. అయితే, మన చుట్టూ ఉన్న పరిస్థితులకంటే, వాటిని మనం చూసే విధానమే మన సంతోషాన్ని, విజయాన్ని నిర్ణయిస్తుందని ప్రముఖ రచయిత వేన్ డయ్యర్ స్పష్టం చేశారు. "మీరు విషయాలను చూసే కోణాన్ని మారిస్తే, మీరు చూసే విషయాలే మారిపోతాయి," అన్నది డయ్యర్ చెప్పిన సక్సెస్ సూత్ర. జీవితంలో సానుకూల మార్పును కోరుకునే ప్రతి ఒక్కరికీ ఈ సూక్తి ఒక దిక్సూచి.

దృక్పథం మారితే.. అనుభవాలు మారుతాయి

సంతోషం, విజయం లేదా ప్రశాంతత అనేవి కేవలం బాహ్య పరిస్థితులపైనే ఆధారపడి ఉంటాయని చాలామంది భావిస్తుంటారు. కానీ, బాహ్య ప్రపంచంలో జరిగే పరిణామాలకంటే, వాటిని మనం ఎలా అర్థం చేసుకుంటున్నామనేదే కీలక పాత్ర పోషిస్తుంది. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారకపోయినా, మన వైఖరి, నమ్మకాలు, ఆలోచనా విధానాన్ని మార్చుకున్నప్పుడు ఆయా పరిస్థితులపై మనకున్న అవగాహన పూర్తిగా మారుతుంది. దీనివల్ల ఒక పెద్ద సవాలు కూడా అద్భుతమైన అవకాశంగా కనిపిస్తుంది. ఓటమి ఒక పాఠంగా మారుతుంది. సమస్యలే వ్యక్తిగత ఎదుగుదలకు పునాదిరాళ్లుగా నిలుస్తాయి. నిజమైన మార్పు ఎప్పుడూ మన అంతరంగం నుంచే మొదలవుతుందన్నది డయ్యర్ చెప్పిన మాటలోని అంతరార్థం.

ప్రతి ఒక్కరి జీవితంలోనూ కష్టాలు, నిరాశలు, అనిశ్చిత పరిస్థితులు ఎదురవుతూనే ఉంటాయి. బాహ్య పరిణామాలను మనం ఎల్లప్పుడూ నియంత్రించలేకపోవచ్చు, కానీ వాటికి మనం ఎలా స్పందిస్తున్నామనేది పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుందని ఈ సందేశం నొక్కి చెబుతుంది. ఈ ఆలోచన మనుషుల్లో ఒక కొత్త నమ్మకాన్ని, బాధ్యతను పెంచుతుంది. ఎందరో విజేతలు తమ చుట్టూ ఉన్న వాతావరణాన్ని మార్చడానికి ముందే, తమ ఆలోచనా విధానాన్ని మార్చుకుని అడ్డంకులను అధిగమించారు. అందుకే ఈ సార్వత్రిక సత్యం అన్ని వయసుల వారికి, అన్ని రంగాల వారికి స్ఫూర్తినిస్తోంది.

ఎలా అలవర్చుకోవాలి?

వేన్ డయ్యర్ చెప్పిన సూక్తిని నిజ జీవితంలో అమలు చేయడానికి కొన్ని సులువైన మార్గాలు ఉన్నాయి. ఏదైనా సమస్య వచ్చినప్పుడు, దీన్ని మరో కోణంలో చూడటానికి అవకాశం ఉందా?" అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. సమస్యల గురించి ఆలోచిస్తూ కూర్చోకుండా, పరిష్కారాలపై దృష్టి పెట్టాలి. అపజయాల గురించి బాధపడటం మానేసి, వాటినుంచి పాఠాలు నేర్చుకోవాలి. మనకు లేని వాటి గురించి చింతించడం కంటే, ఉన్న వాటికి కృతజ్ఞత చూపే అలవాటును పెంచుకోవాలి. ఎల్లప్పుడూ సానుకూల దృక్పథం ఉన్న వ్యక్తులతో స్నేహం చేయడం, విశాల భావాలతో ఉండటం వల్ల జీవితంపై ఒక ఆరోగ్యకరమైన అవగాహన ఏర్పడుతుంది. ఇది కాలక్రమేణా ఆత్మవిశ్వాసాన్ని, మానసిక దృఢత్వాన్ని పెంచుతుంది.

వ్యక్తిత్వ వికాసం, సానుకూల ఆలోచనా విధానం, ఆధ్యాత్మిక ఎదుగుదలపై వేన్ డయ్యర్ చేసిన ప్రసంగాలు, రాసిన పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేశాయి. ఆయన రాసిన 'యువర్ ఎరోనియస్ జోన్స్' పుస్తకం కోట్లాది ప్రతులు అమ్ముడుపోయి, ప్రపంచంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన పుస్తకాలలో ఒకటిగా నిలిచింది.


# రిఫైనరీ.. రక్షణ కవచం!



ఇంధన సంక్షోభాన్ని దేశాలు రెండు విధాలుగా అధిగమించగలుగుతాయి. ఒకటి -దౌత్యం, వైవిధ్యం, ఆర్థిక చర్యలను సమర్థంగా నిర్వహించడం ద్వారా, రెండు -అస్తవ్యస్తమైన వనరుపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం ద్వారా. 2026 హార్మూజ్ జలసంధి సంక్షోభంలో భారత్ మొదటిమార్గంలో అత్యుత్తమ ప్రదర్శన చేసింది. అయితే రెండో మార్గంలో -అంటే మూల ఆధారపడికతను నిర్మూలించే దిశలో ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. హార్మూజ్ జలసంధి మూతపడినప్పుడు భారత శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) అసాధారణమైన సాంకేతిక అనుకూల సామర్థ్యం ప్రదర్శించాయి. ముడి చమురు సరఫరా అస్తవ్యస్తమవగానే అమెరికా, అట్లాంటిక్ బేసిన్, పశ్చిమ ఆఫ్రికా, రష్యా, మరియు పశ్చిమాసియా భాగస్వాముల నుంచి ప్రత్యామ్నాయ ముడి చమురును వేగంగా ప్రాసెస్ చేయగలిగాయి. జలసంధి మూసివేత జరిగిన కొన్ని వారాల్లోనే హార్మూజ్ యేతర వనరుల నుంచి ముడి చమురు దిగుమతి 55శాతం నుంచి 70 శాతానికి పెరిగింది. ఇది కేవలం కాగితంపై జరిగిన మార్పు కాదు.. ఒక దశాబ్దంపాటు జరిగిన ఊర్ధ్వ వైవిధ్యం (అప్‌స్ట్రీమ్ డైవర్సిఫికేషన్). అదే సమయంలో -రిఫైనరీ సాంకేతిక సామర్థ్యాల్లో నిర్మించుకున్న దిగువ వశ్యత (డౌన్‌స్ట్రీమ్ ఫ్లెక్సిబిలిటీ) ఫలితం. గత రెండు దశాబ్దాలలో భారత్ తన ముడి చమురు సరఫరాదారుల సంఖ్యను దాదాపు మూడు రెట్లు పెంచుకుంది. ప్రతి సరఫరాదారు విభిన్న సాంద్రత, సల్ఫర్ పరిమాణం, స్నిగ్ధత కలిగిన ముడి చమురు అందిస్తారు. కేవలం ఒకరకం ముడి చమురుకే అనుగుణంగా నిర్మించిన రిఫైనరీ సరఫరా అంతరాయాలకు హాని కలిగి ఉంటుంది. దేశీయ పరిశోధన, లోహ శాస్త్ర అభివృద్ధి, ప్రక్రియ ఆవిష్కరణ, కార్మికుల శిక్షణలో నిరంతరం పెట్టుబడులు పెట్టడం ద్వారా భారత రిఫైనింగ్ రంగం విస్తృత శ్రేణి ముడి చమురును ప్రాసెస్ చేయగలిగే సామర్థ్యాన్ని సంపాదించింది. ఈ సంక్షోభంలో ఆ సామర్థ్యమే భారత్‌ను రక్షించింది. ఇది ఏ దౌత్య ఏర్పాటుకంటే, ఏ సైనిక వ్యవస్థకంటే మరింత స్థిరమైన ఇంధన భద్రత సాధనమని ఈ సంక్షోభం నిరూపించింది.

ఎల్పీజీ కథనం ఈ విషయాన్ని మరింత స్పష్టంగా చెబుతుంది. హార్మూజ్ మూతపడినప్పుడు ఎల్పీజీ సరఫరాకు అసలు అడ్డంకి దిగుమతి రేవుల వద్ద కాదు.. అందుబాటులో ఉన్న ముడి చమురునుంచి ఇప్పటికే ఉన్న రిఫైనరీలు ఎంత ఎల్పీజీ ఉత్పత్తి చేయగలవనే పరిమితే అడ్డంకిగా నిలిచింది. ఎల్పీజీ నియంత్రణ ఉత్తర్వు కింద రిఫైనరీలను గరిష్ఠ ఉత్పత్తికి ఆదేశించారు. ఇంజనీర్లు రియల్ టైమ్‌లో ఫ్రాక్షనేషన్, క్రాకింగ్ యూనిట్లను సర్దుబాటు చేయడంతో ఐదు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి రోజుకు 35 వేల మెట్రిక్ టన్నులనుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇది కేవలం గణాంకాల మార్పు కాదు.. ఇంజనీరింగ్ చర్య; సంవత్సరాల పెట్టుబడులు, ఆపరేటర్ శిక్షణ, ప్రక్రియ అవగాహనపై నిర్మించిన సంస్థాగత జ్ఞానం యొక్క ఆచరణాత్మక ఫలితం. సిఎస్ఐఆర్ నేషనల్ కెమికల్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు ఎప్పుడో మిథనాల్‌ను డైమిథైల్ ఈథర్ (డీఎంఈ)గా మార్చే దేశీయ సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఆ పైలట్ సాంకేతికతను పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ హై టెక్నాలజీ వేగంగా ఆమోదించి విస్తరణకు సిద్ధపరిచింది. ఇది ఏళ్ళ క్రితం జరిగిన శాస్త్రీయ పెట్టుబడి.. సంక్షోభ సమయంలో జాతీయ వ్యూహాత్మక ఆస్తిగా ఎలా మారుతుందో చూపించింది. పరిశోధన ప్రయోగశాలలు జ్ఞానాన్ని సృష్టిస్తాయి, ప్రభుత్వ సంస్థలు వ్యూహాత్మక అవకాశాలను గుర్తిస్తాయి, పరిశ్రమ ఆశాజనకమైన సాంకేతికతలను విస్తరిస్తుంది. ఇది ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థ (ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్) ఎలా పని చేయాలో చెప్పే ఆదర్శ నమూనా. అయితే ఈ సంక్షోభం మరొక లోతైన సత్యాన్ని కూడా బయట పెట్టింది. రిఫైనరీని 40 దేశాల ముడి చమురు ప్రాసెస్ చేసేలా ఇంజనీరింగ్ చేయవచ్చు. కానీ ఎల్పీజీ మాత్రం 40 వేర్వేరు ప్రదేశాల నుంచి రాలేదు.. ఆ అణువు (మాలిక్యూల్) కేవలం కొద్ది గల్ఫ్, అట్లాంటిక్ బేసిన్ ఉత్పత్తిదారుల నుంచే వస్తుంది. కాబట్టి దీర్ఘకాలిక పరిష్కారం అదే దిగుమతి అణువును మరింత సమర్థంగా శుద్ధి చేయడంలో లేదు.. అది పని చేసే దేశీయ అణువును ఉత్పత్తి చేయడంలో ఉంది.

ఆ అణువు ఇప్పటికే అందుబాటులో ఉంది, భారత్ దాని ముడి వనరును అపారంగా కలిగి ఉంది. డైమిథైల్ ఈథర్ (డీఎంఈ) ఒక పరిశుభ్రంగా మండే వాయువు. ఎల్పీజీకి రసాయనికంగా చాలా దగ్గరగా ఉండటంతో నేరుగా ఇప్పటికే ఉన్న సిలిండర్లు, పైప్‌లైన్‌లలో మిశ్రమం చేయవచ్చు; కొత్త పంపిణీ వ్యవస్థ అవసరం లేదు. బొగ్గు వాయవీకరణ (కోల్ గ్యాసిఫికేషన్) ద్వారా సింగ్యాస్ మార్గంలో డీఎంఈ ఉత్పత్తి చేయవచ్చు. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు కలిగిన దేశాల్లో ఒకటి. భారత ప్రమాణ బ్యూరో ఇప్పటికే ఎల్పీజీతో 20 శాతం డీఎంఈ మిశ్రమాన్ని ఆమోదించింది. ఒక ఇటీవలి పరిశ్రమ అంచనా ప్రకారం, బొగ్గు వాయవీకరణ ద్వారా 20 శాతం మిశ్రమం ఏటా సుమారు 63 లక్షల టన్నుల ఎల్పీజీ దిగుమతులను భర్తీ చేయగలదు. ఫలితంగా ఏటా దాదాపు రూ.34,000 కోట్ల విదేశీ మారక వ్యయం ఆదా అవుతుంది. ఇది చిన్న లాభం కాదు.. హార్మూజ్ సంక్షోభం నేర్పిన పాఠాన్ని తీవ్రంగా తీసుకోవాల్సిన నిర్మాణాత్మక దిగుమతి తగ్గింపు ఇది. ఈ విషయంలో విధాన నిర్ణయం ఇప్పటికే జరిగింది. కేంద్ర కేబినెట్ రూ.37,500 కోట్ల పథకాన్ని ఆమోదించింది. పశ్చిమాసియా సంక్షోభాన్నే కారణంగా పేర్కొంటూ, 2030నాటికి ఏటా 100 మిలియన్ టన్నుల బొగ్గు వాయవీకరణ సాధించాలన్న లక్ష్యంతో. ఈ పథకం యంత్ర, ఉపకరణ వ్యయంలో 20 శాతం ప్రోత్సాహాన్ని అందిస్తుంది; బొగ్గు లింకేజ్ కాలాన్ని 30 ఏళ్ళకు పొడిగించింది. మూలధన ఇంటెన్సివ్ పరిశ్రమలకు పెట్టుబడి నిర్ణయాల కోసం అవసరమైన దీర్ఘకాల నిశ్చయత ఇది. కానీ ఇప్పుడు మిగిలింది అమలు మాత్రమే. భారత బొగ్గులో బూడిద పరిమాణం ఎక్కువగా ఉంటుంది. చైనా తన బొగ్గు-రసాయన పరిశ్రమను నిర్మించుకున్న పరిశుభ్రమైన బొగ్గుతో పోల్చితే ఇది సాంకేతిక సవాలు. దేశీయ వాయవీకరణ సామర్థ్యం ఈ పథకం లక్ష్యానికి చాలా దూరంలో ఉంది. ఆ అంతరాన్ని మూయడం ఇప్పుడు పారిశ్రామిక క్రమశిక్షణ, పెట్టుబడి ప్రశ్న, విధాన ఉద్దేశం ఇప్పటికే స్పష్టమైంది. హార్మూజ్ సంక్షోభం నేర్పిన పాఠం ఏమిటంటే, భారత రిఫైనరీలు సిద్ధంగా ఉన్నాయి కానీ మిగతాదంతా మారకుండా ఉంచవచ్చు అని కాదు. దేశీయ సామర్థ్యం ఒకసారి నిర్మించుకుంటే అది శాశ్వత వ్యూహాత్మక ఆస్తిగా మారుతుందని, ఆ తదుపరి నిర్మాణానికి విధాన నిబద్ధత ఇప్పటికే కుదిరిందని.. అణువు వేరు అయినప్పటికీ, దాన్ని ఆయత్తం చేసుకోవడానికి అవసరమైన క్రమశిక్షణ రిఫైనరీలను ఈ సంక్షోభం నుంచి గట్టెక్కించిన అదే క్రమశిక్షణ అని!! ■




పెద్ద లక్ష్యాల కోసం ఎప్పుడూ పెద్ద పెద్ద పనులే చేయనవసరం లేదు. చాలావరకు విజయం అనేది ఒక చిన్న అడుగుతోనే మొదలవుతుంది. పిల్లల చదువు కోసం లక్షల్లో దాచడం కష్టంగా అనిపించొచ్చు. కానీ రోజూ అదనంగా రూ.100 పొదుపు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. అదే మైక్రో-యాక్షన్ శక్తి! నేటినుంచే చిన్నగా మీ లక్ష్యాల వైపు అడుగులు వేయండి. తర్వాత వచ్చే ఉన్నతమైన ఫలితాలను చూసి మీరే ఆశ్చర్యపోతారు. గొప్ప చెట్టు ఒక్క చిన్న విత్తనం నుంచే మొదలవుతుంది --- అలాగే గొప్ప జీవితం కూడా ఒక్క చిన్న నిర్ణయం నుంచే మొదలవుతుంది. నేడు వేసే ఆ చిన్న అడుగే రేపటి మీ పెద్ద విజయానికి పునాది.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## వెరైటీ వేలంవెర్రి!



మెక్సికో జలిస్కో రాష్ట్రంలోని లాగోస్ డి మొరెనో పట్టణంలో ఒక మిస్టీరియస్ విజిలాంటీ సంచలనం సృష్టిస్తున్నాడు. మోటార్‌సైకిల్ దొంగలను పట్టుకుని డక్ట్ టేప్‌తో వీధి లైట్ స్తంభాలకు కట్టేసి వదిలేస్తున్నాడు. స్థానికులు అతడిని "బ్యాట్‌మ్యాన్ ఆఫ్ లాగోస్ డి మొరెనో" అని పిలుస్తున్నారు. జూన్ 13న తొలి సంఘటన జరిగింది. ఒక వ్యక్తిని స్తంభానికి కట్టేసి, నుదుటిపై "దొంగ" అని రాశారు; పక్కనే దొంగిలించిన బైక్ కూడా ఉంది. అప్పటినుంచి ఇప్పటి వరకు ఇలాంటి ఐదు కేసులు నమోదయ్యాయి. పోలీసుల నిర్లక్ష్యానికి విసిగిపోయి ఈ స్వయంగా న్యాయం చేసే పని చేస్తున్నాడని నమ్ముతున్నారు. సోషల్ మీడియాలో ఇతన్ని సమర్థించేవారు, వ్యతిరేకించేవారు ఇద్దరూ ఉన్నారు. అధికారులు మాత్రం "చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు" అని హెచ్చరిస్తున్నారు.

# డిప్రెషన్ అంటే కేవలం మానసిక ఆరోగ్య సమస్యనే కాదు, మెదడు పనితీరుపైనా ప్రభావం చూపిస్తుంది..


డిప్రెషన్ అనేది కేవలం మానసిక ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, అది మెదడు పనితీరుపై కూడా గణనీయమైన ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా డిప్రెషన్ ఎంతకాలం కొనసాగుతుందనే అంశం మెదడులో సంభవించే మార్పుల తీవ్రతను ప్రభావితం చేస్తుందని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం ఫలితాలు భవిష్యత్తులో వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ పరిశోధనలో మేజర్ డిప్రెషన్‌తో బాధపడుతున్న 46 మంది రోగుల మెదడు స్కాన్‌లను విశ్లేషించారు. పరిశోధన ఫలితాలు డిప్రెషన్ ఎపిసోడ్‌ల వ్యవధి, మెదడులోని వివిధ నాడీ నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానంలో ఉన్న మార్పుల మధ్య సంబంధం ఉందని సూచించాయి. ముఖ్యంగా రెండేళ్లకు పైగా డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో, ఇటీవల డిప్రెషన్ ప్రారంభమైన వారితో పోలిస్తే భిన్నమైన మెదడు కనెక్టివిటీ నమూనాలు కనిపించాయి.

**సమన్వయం దెబ్బ తినే అవకాశం..**

మెదడులోని సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ నెట్‌వర్క్ (జజుచీ) నిర్ణయాలు తీసుకోవడం, లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించడం వంటి పనులకు బాధ్యత వహిస్తుంది. మరోవైపు డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్ (ఐవీచీ) అనేది ఆత్మపరిశీలన, వ్యక్తిగత ఆలోచనలు, జ్ఞాపకాలతో సంబంధం కలిగి ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో ఈ రెండు నెట్‌వర్క్‌లు సమతుల్యంగా పనిచేస్తాయి. అయితే డిప్రెషన్ ఉన్నవారిలో ఈ సమన్వయం దెబ్బతినే అవకాశం ఉందని అధ్యయనం వెల్లడించింది. ఈ అసమతుల్యత కారణంగా వ్యక్తులు ప్రతికూల ఆలోచనల్లో చిక్కుకుపోవడం, పదేపదే అదే విషయాలను ఆలోచించడం, అవసరమైన సమయంలో పరిసరాలపై దృష్టి సారించడంలో ఇబ్బంది పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయని పరిశోధకులు తెలిపారు. డిప్రెషన్ తీవ్రత పెరిగే కొద్దీ ఈ ప్రభావాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొన్నారు.

**డిప్రెషన్‌తో నెగెటివ్ ప్రభావం..**

అధ్యయనంలో మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. ఇటీవల డిప్రెషన్ ప్రారంభమైన రోగుల్లో లక్షణాలు తీవ్రమవుతున్న కొద్దీ జజుచీ, ఐవీచీ మధ్య అనుసంధానం తగ్గుతున్నట్లు గుర్తించారు. అయితే చాలా కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో పరిస్థితి భిన్నంగా కనిపించింది. వారిలో డిప్రెషన్ తీవ్రత పెరిగే కొద్దీ ఈ రెండు నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానం మరింత బలపడుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ ఫలితాలు డిప్రెషన్ కారణంగా మెదడులో జరిగే మార్పులు కాలక్రమేణా అభివృద్ధి చెందుతాయని సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో కొన్ని నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానం తగ్గిపోతుంది. అయితే వ్యాధి ఎక్కువకాలం కొనసాగినప్పుడు లేదా పదేపదే తిరిగి వచ్చినప్పుడు మెదడు పనితీరులో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. డిప్రెషన్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ఎంత ముఖ్యమో ఈ పరిశోధన మరోసారి స్పష్టం చేసింది. మెదడులోని మార్పులను అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ప్రతి వ్యక్తి పరిస్థితికి అనుగుణంగా మరింత సమర్థవంతమైన చికిత్సా విధానాలను అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# వేసవి కాలంలో రోజంతా బయట పనిచేసేవారు పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే..

వేసవి కాలం బయట పని చేసే కార్మికులకు ఒక పెద్ద సవాల్ లాంటిదని చెప్పవచ్చు. నిర్మాణ కార్మికులు, రోడ్డు పని చేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, రోజువారీ కూలీలు వంటి వారు మండే ఎండలో గంటల తరబడి పనిచేయాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఆహారం కేవలం ఆకలి తీర్చడానికే కాదు, శరీరానికి శక్తిని అందించడానికి, నీటి లోపాన్ని తగ్గించడానికి, అలసటను ఎదుర్కోవడానికి కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఎండలో పని చేసే కార్మికులు వేసవికాలంలో ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇవి తక్కువ ఖర్చుతో లభించడమే కాకుండా, శరీరానికి చల్లదనాన్ని అందించి తీవ్రమైన వేడిని తట్టుకునే శక్తిని ఇస్తాయి. వేసవిలో కార్మికులు భోజనంలో పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడమే కాకుండా జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆకలి తగ్గినప్పుడు కూడా పెరుగును సులభంగా తినగలుగుతారు. చాలామంది పెరుగును అన్నంతో కలిపి లేదా రోటీతోపాటు తీసుకుంటారు. ఇది శరీరానికి ఉపశమనం కలిగించడంతోపాటు తేలికైన పోషణను అందిస్తుంది.

**పెరుగు, మజ్జిగ, కూరగాయలు..**

పెరుగుతోపాటు మజ్జిగను కూడా కార్మికులు వేసవి ఆహారంలో ముఖ్యమైన భాగంగా చేసుకోవాలి. రోజంతా చెమటలు పట్టే పనులు చేసే వారికి మజ్జిగ దాహాన్ని తగ్గించి శరీరాన్ని తాజాగా ఉంచుతుంది. జీలకర్ర పొడి, ఉప్పు లేదా పుదీనాతో తయారు చేసే మజ్జిగ మరింత రుచికరంగా ఉండటంతోపాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. తక్కువ సమయంలో తాగగలిగే ఈ పానీయం ఎండలో పనిచేసే వారికి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. అధిక మసాలాలు, నూనెతో చేసిన ఆహారం వేసవిలో భారంగా అనిపిస్తుంది. కనుక పెరుగన్నం, పప్పన్నం లేదా తేలికపాటి ఖిచిడీ వంటి ఆహారాలను ఎంచుకోవాలి. ఇవి కడుపుని నింపడంతోపాటు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ముఖ్యంగా అన్నం త్వరగా జీర్ణమై శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, దోసకాయ, నిమ్మకాయ, టమాటా వంటి ముడి కూరగాయలు కూడా వేసవిలో కార్మికుల భోజనంలో తరచూ కనిపిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం లభిస్తుంది. ముఖ్యంగా దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో దాహాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, పచ్చిమిర్చి, ఉప్పుతో కలిసి తింటే భోజనానికి రుచి పెరగడంతోపాటు వేడి ప్రభావాన్ని కూడా కొంత మేర తగ్గిస్తుంది.



**కొబ్బరినీళ్లు, పండ్లు..**

అవకాశం ఉన్నప్పుడు కొబ్బరి నీరు, సీజనల్ పండ్లు కూడా కార్మికులు ఆహారంలో భాగంగా తీసుకోవాలి. కొబ్బరి నీరు శరీరాన్ని త్వరగా హైడ్రేట్ చేయడంలో సహాయపడుతాయి. పుచ్చకాయ, తర్బూజా వంటి పండ్లు అధిక నీటి శాతంతో ఉండటంతో వేసవిలో శరీరానికి చల్లదనం అందిస్తాయి. మామిడి పండ్లు కూడా శక్తినిస్తాయి కానీ ఎక్కువగా తీసుకుంటే భారంగా అనిపించే అవకాశం ఉంటుంది కనుక మితంగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. చాలా మంది కార్మికులు ఉదయం ఇంటి నుంచి తీసుకెళ్లే రోటీలు, కూరలపై ఆధారపడతారు. కనుక సొరకాయ, బీరకాయ, గుమ్మడికాయ, ఆలుగడ్డ వంటి సీజనల్ కూరగాయలతో చేసిన సాధారణ కూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఇవి ఎక్కువసేపు నిల్వ ఉండటమే కాకుండా జీర్ణక్రియకు కూడా అనుకూలంగా ఉంటాయి. తక్కువ నూనె, కొద్దిపాటి ఉప్పుతో తయారుచేసే ఈ భోజనం శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది.

**సత్తు పానీయం..**

ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో సత్తు వేసవిలో అత్యంత ప్రజాదరణ పొందిన ఆహారాల్లో ఒకటి. నీటిలో సత్తు, నిమ్మరసం, ఉప్పు కలిపి తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది ఒకేసారి దాహాన్ని తీర్చడమే కాకుండా పొట్టని కూడా నింపుతుంది. అలాగే అటుకులు వంటి తేలికపాటి ధాన్యాలతో తయారుచేసిన ఆహారాలు కూడా సులభంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి.వేసవిలో కార్మికులు ఈ సంప్రదాయ ఆహారాలు తీసుకోవడం ద్వారా కేవలం ఆకలి తీరడమే కాదు, మండే ఎండను ఎదుర్కొనే శక్తిని అందించే సహజ రక్షణ కవచాలుగా కూడా పనిచేస్తాయి. తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే ఈ ఆహారాలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు

# రాత్రి భోజనం చేశాక కాసేపు నడిస్తే ఎన్నో లాభాలు.. రోజూ చేయాలంటున్న వైద్యులు..



భోజనం చేసిన వెంటనే కొద్దిసేపు నడవడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఫార్ట్ వాక్స్ పేరుతో వైరల్ అవుతోంది. అయితే ఇది కొత్త అలవాటు కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. భోజనం తర్వాత స్వల్పంగా నడవడం జీర్ణక్రియకు చాలా కాలంగా సూచిస్తున్న సరళమైన అలవాట్లలో ఒకటని వివరిస్తున్నారు. ఈ చిన్న నడక కేవలం ఆహారం జీర్ణం కావడానికే కాదు, కడుపులో గ్యాస్, ఉబ్బరం తగ్గించడంలో, మలబద్ధకం తగ్గించడంలో, అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జీర్ణాశయ ఆరోగ్య నిపుణుల ప్రకారం భోజనం చేసిన తర్వాత 5 నుంచి 15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. ఇంటి చుట్టూ, ఆఫీస్‌లో, ట్రెడ్‌మిల్‌పై లేదా బయట వీధిలో నెమ్మదిగా నడిచినా సరిపోతుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సమయంలో కఠినమైన వ్యాయామం చేయకుండా సాదాసీదా నడక మాత్రమే చేయాలని సూచిస్తున్నారు.

**గ్యాస్ బయటకు వెళ్తుంది..**

భోజనం తర్వాత నడక వల్ల ఆహారం పేగుల్లో సులభంగా కదలడంలో సహాయం జరుగుతుంది. దీని వల్ల కడుపులో చిక్కుకుపోయిన గ్యాస్ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండి ఉబ్బరం తగ్గుతుంది. అలాగే పేగుల కదలికలు మెరుగుపడి మల విసర్జన సులభమవుతుంది. యాసిడ్ రిఫ్లక్స్ సమస్యతో బాధపడేవారికి కూడా ఈ అలవాటు కొంత ఉపశమనం ఇస్తుంది. భోజనం చేసిన వెంటనే పడుకోవడం లేదా కూర్చోవడం కంటే కొద్దిసేపు నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి అసౌకర్యం తగ్గుతుంది. ఈ అలవాటులో ప్రత్యేకమైన పరికరాలు, ఖరీదైన ఫిట్‌నెస్ సామగ్రి అవసరం లేదు. ఎవరైనా సులభంగా రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారికి భోజనం తర్వాత చిన్న నడక శరీరానికి చలనం కలిగించి ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

**ఎలా నడవాలి..**

ఫార్ట్ వాక్స్ చేయాలంటే ముందుగా భోజనం పూర్తి చేసిన తర్వాత కొద్దిసేపు ఆగాలి. ఆ తర్వాత నెమ్మదిగా, ఒత్తిడి లేకుండా నడవాలి. వేగంగా పరుగులు తీయడం లేదా గట్టిగా వ్యాయామం చేయడం మంచిది కాదు. రోజూ రాత్రి భోజనం తర్వాత ఇలా కొద్దిసేపు నడిస్తే జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. సాధారణంగా కనిపించే ఈ అలవాటు దీర్ఘకాలంలో మంచి ఆరోగ్యానికి దోహదపడుతుంది. ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలు, గ్యాస్, మలబద్ధకం వంటి ఇబ్బందులు తరచూ ఎదురయ్యే వారు ఈ అలవాటును ప్రయత్నించవచ్చు.

# వైభవ్ సూర్యవంశీని ఆడించాల్సింది.. ప్యాంట్లు ఊడగొట్టేవాడు: రవిశాస్త్రి



భారత జట్టు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఐర్లాండ్ పర్యటనలో తుది జట్టులోకి తీసుకోకపోవడంపై టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇండియన్ టీమ్ లోకి తొలిసారి పిలుపు అందుకున్న 15 ఏళ్ల వైభవ్, వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితం కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మలు అద్భుత ఫామ్‌లో ఉండటంతో ఈ నిర్ణయం సమర్థనీయమే అయినప్పటికీ, ఐర్లాండ్ సిరీస్‌లో భారత బ్యాటింగ్ ఘోరంగా విఫలమై 2--0తో సిరీస్ ఓడిపోయింది.

**అతడ్ని బెంచ్‌పై కూర్చోబెడతారా?:**

గత 12 నెలలుగా వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని రవిశాస్త్రి గుర్తు చేశారు. ముఖ్యంగా ఐపీఎల్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లను సైతం చితక్కొడుతూ ఏకంగా 776 రన్స్ సాధించి ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడని పేర్కొన్నారు. అంతటి ఫామ్‌లో ఉన్న ప్లేయర్‌ను ఐర్లాండ్ టూరులో ఆడించి ఉంటే, అక్కడి చిన్న మైదానాల్లో ప్రత్యర్థి బౌలింగ్‌ను ముక్కలు ముక్కలు చేసేవాడని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు.

**రవిశాస్త్రి తనదైన శైలిలో కామెంట్స్:**

ఐర్లాండ్ సిరీస్‌లోనే వైభవ్ సూర్యవంశీ కచ్చితంగా ఆడాల్సింది.. అక్కడ పిచ్‌లు చాలా స్లోగా, స్పాంజీగా ఉన్నాయి, పైగా గ్రౌండ్ కూడా చాలా చిన్నది.. అతను గనుక బరిలోకి దిగి ఉంటే బంతిని స్టేడియం బయటకి బాదేవాడు.. ప్రత్యర్థి బౌలర్ల ప్యాంట్లు ఊడదీసేలా ఆడి ఉండేవాడని పేర్కొన్నాడు. ఇప్పుడు ఇంగ్లాండ్ సిరీస్‌లో అతనికి అవకాశం ఇస్తారో లేదో నాకు తెలియదు.. కానీ అతనికి వీలైనంత త్వరగా జట్టులో ఛాన్స్ ఇవ్వాలి.. ఐపీఎల్‌లో అతను ఏ ఫాస్ట్ బౌలర్‌ను వదిలిపెట్టలేదు.. అలాంటి ఆటగాడిని తెచ్చి మీరు బెంచ్ పై కూర్చోబెడతారా? అని మండిపడ్డాడు.

**అతనే టీమిండియా ఎక్స్-ఫ్యాక్టర్:**

వైభవ్ సూర్యవంశీ భారత జట్టుకు ఒక ఎక్స్-ఫ్యాక్టర్.. అతని కోసం జట్టులో ఎలాగైనా స్థానం కల్పించాలని రవిశాస్త్రి మేనేజ్‌మెంట్‌కు సూచించారు. కేవలం 15 ఏళ్ల వయసున్న వైభవ్‌కు ఎలాంటి ముందస్తు అంచనాల ఒత్తిడి, యువ రక్తం కావడంతో అతను మైదానంలో నిర్భయంగా ఆడతాడని కొనియాడారు. అతను గనుక క్రీజులో నిలదొక్కుకుని మొదటి 2, 3 ఓవర్లు ఆడితే, మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు భారీ స్కోర్లు చేయడానికి అవసరమైన బలమైన పునాదిని ఓపెనింగ్‌లోనే అందిస్తాడని రవిశాస్త్రి గట్టిగా చెప్పారు.

# కరీంనగర్ డైమండ్స్ అదిరిపోయే కమ్‌బ్యాక్.. రంగారెడ్డిపై 58 రన్స్ తేడాతో విజయం





టీజీ20 లీగ్ 2026 ప్రారంభంలో వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిపోయిన కరీంనగర్ డైమండ్స్ జట్టు ఇప్పుడు టోర్నమెంట్‌లో దూసుకుపోతుంది. ఈరోజు (జులై 2న, గురువారం రంగారెడ్డి రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 58 పరుగుల భారీ తేడాతో విక్టరీ సాధించింది. ఈ లీగ్‌లో వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకున్న కరీంనగర్ డైమండ్స్, పాయింట్ల పట్టికలో ఏకంగా రెండో స్థానానికి దూసుకెళ్లి రచ్చ లేపింది.

**కరీంనగర్ బ్యాటర్ల ఊచకోత:**

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ డైమండ్స్ బ్యాటర్లు రంగారెడ్డి బౌలర్లపై చెలరేగిపోయారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి ఏకంగా 230 పరుగులని స్కోరుబోర్డుపై పెట్టారు. ఇక కరీంనగర్ బ్యాటర్లలో రాహుల్ రాడేశ్ (37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 72 రన్స్ ), నిఖ సింహ (38 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 పరుగులు) హాఫ్ సెంచరీలతో కిరాక్ ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరి జోడీ మూడో వికెట్‌కు ఏకంగా 123 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టు భారీ స్కోరు చేయడంలో కీ రోల్ పోషించింది. ఓపెనర్లు సాత్విక్ రెడ్డి (13 బంతుల్లో 24), తన్మన్ అగర్వాల్ (16 బంతుల్లో 29) పర్వాలేదనిపించగా, చందన్ సహాని 19, శుభమ్ శర్మ 17లి రన్స్ చేశారు. కాగా రంగారెడ్డి బౌలర్లలో తనయ్ జడ్డూ 2 వికెట్లు తీసుకోగా.. నితిన్ సాయి యాదవ్, తనయ్ త్యాగరాజన్ చెరో వికెట్ పడగొట్టారు.

**చేతులెత్తేసిన రంగారెడ్డి రైజర్స్ బ్యాటర్లు:**

231 రన్స్ లక్ష్యంతో బరిలోకి దిగిన రంగారెడ్డి రైజర్స్ జట్టు కరీంనగర్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక నిర్ణీత 20 ఓవర్లలో 172/9 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. రంగారెడ్డి బ్యాటర్లలో ఆదిత్య జవ్వాజి (31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 48 పరుగులు) టాప్ స్కోరర్‌గా నిలిచినప్పటికీ జట్టును మాత్రం గెలిపించలేకపోయాడు. జ్ఞాన ప్రకాష్ రెడ్డి (23), ఆరోన్ జార్జ్ (19), నితిన్ సాయి యాదవ్ (15) తక్కువ రన్స్ కే ఔట్ కాగా.. చివర్లో ఆర్యన్ కరియప్ప (20 బంతుల్లో 30లి) కాస్త దూకుడుగా ఆడినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీంతో 58 పరుగుల తేడాతో కరీంనగర్ డైమాండ్స్ చేతిలో రంగారెడ్డి ఓడిపోయింది.

# శ్రీలంకతో భారత్ టెస్ట్ సిరీస్.. తేదీలు, టైమింగ్స్ ప్రకటించిన బీసీసీఐ!




భారత క్రికెట్ జట్టు ఆగస్టు మాసంలో శ్రీలంకలో పర్యటించనుందని లంక క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. 2025--2027 ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా ఈ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో మొదటి టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలే ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ (రాజ) గ్రౌండ్‌లో నిర్వహిస్తారు.

**డబ్ల్యూటీసీ ఫైనల్ రేస్.. శ్రీలంకకు ప్రతి మ్యాచ్ అత్యంత కీలకం:**

గతంలో రెండుసార్లు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరినా టైటిల్ గెలవలేకపోయిన భారత జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతుండగా.. శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. వచ్చే ఏడాది జరగబోయే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరడానికి శ్రీలంకకు కేవలం 5 నుంచి10 శాతం అవకాశాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. దాంతో హోమ్ గ్రౌండ్‌లో జరగబోయే ఈ సిరీస్‌లో లంక జట్టు ఏ చిన్న తప్పు చేసినా ఫైనల్ రేస్ నుంచి పూర్తిగా తప్పుకోవాల్సి వస్తుంది.

**గిల్ సేనకు కమ్‌బ్యాక్ ఛాన్స్.. స్పిన్ పిచ్‌లపై అసలైన పరీక్ష:**

శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఇంగ్లాండ్‌తో 2- 2 తేడాతో సిరీస్ డ్రా చేసుకోవడం, వెస్టిండీస్‌పై హోమ్ సిరీస్ గెలవడంతో గిల్ ఎరా బాగానే ప్రారంభమైంది. కానీ, గత ఏడాది సౌతాఫ్రికా చేతిలో స్వదేశంలో క్లీన్ స్వీప్ ఓటమి భారత జట్టు అవకాశాలని దెబ్బతీసింది. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్ల వైఫల్యం, అలాగే మన స్పిన్ విభాగంలో పస తగ్గడం లాంటి లోపాలు ఆ సిరీస్‌లో స్పష్టంగా బయటపడ్డాయి. ఐపీఎల్ లో ఉండే ఫ్లాట్ పిచ్‌లు, టెస్ట్ మ్యాచ్‌లకు ముందు తగినంత ప్రాక్టీస్ సమయం లేకపోవడమే ఇండియన్ బ్యాటర్లు స్పిన్‌కు ఇబ్బంది పడటానికి ప్రధాన కారణాలుగా మారుతుండగా, ఇప్పుడు శ్రీలంక పిచ్‌లపై లంక స్పిన్నర్లను తట్టుకుని నిలబడటం గిల్ సేనకు అతిపెద్ద సవాల్ కానుంది.

# సింప్లిసిటీనే బ్యూటీ... అమైరా దస్తూర్ ఎలిగెంట్ లుక్ వైరల్!

ఫిలిం ఇండ్రస్ట్రీలో మూడు భాషల్లో సినిమాలు చేస్తూ, తన టాలెంట్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాల తార అమైరా దస్తూర్. నటనతోనే కాకుండా తన అదిరిపోయే ఫ్యాషన్ సెన్స్‌తో కూడా ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా ఆమె సాంప్రదాయ లుక్‌లో చేసిన ఒక సాఫ్ట్ అండ్ క్లాసిక్ ఫొటోషూట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మోడరన్ డ్రెస్సుల్లోనే కాకుండా ట్రెడిషనల్ చీరకట్టులోనూ ఆమె అందం నెక్స్ట్ లెవెల్‌లో ఉందంటూ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.

**లావెండర్ ఆర్గాంజా శారీలో మెరిసిన భామ:**

ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో అమైరా దస్తూర్ 'హౌస్ ఆఫ్ సుహి' ఫ్యాషన్ బ్రాండ్‌కు చెందిన లైట్ లావెండర్ కలర్ ఆర్గాంజా శారీ కట్టుకుంది. ఇక ఎంతో సున్నితంగా, సింపుల్ మిర్రర్ వర్క్ డిజైన్‌తో ఉన్న ఈ పారదర్శక చీరలో ఆమె చాలా ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. భారీ డిజైన్లు లేకుండా ఎంతో సింపుల్‌గా ఉన్నా.. ఆమె రాయల్ లుక్ మాత్రం అందరినీ కట్టిపడేస్తోంది.

**పర్ఫెక్ట్ మ్యాచ్.. స్లీవ్‌లెస్ బ్లౌజ్ మరియు గాజులు:**

ఈ లైట్ కలర్ చీరకు కాంట్రాస్ట్‌గా ఉండేలా ఐమైరా డీప్ పర్పుల్ కలర్ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను మ్యాచ్ చేసింది. ఈ కలర్ కాంబినేషన్ ఆమె లుక్‌ను మరింతగా ఎలివేట్ చేసింది. ఇక దీనికి తోడు చేతులకు వేసుకున్న మ్యాచింగ్ పర్పుల్ కలర్ గాజులు ఆ లుక్‌కు పర్ఫెక్ట్ ట్రెడిషనల్ టచ్ ఇచ్చాయి. ఆభరణాల విషయంలో కూడా ఎక్కువ హడావుడి లేకుండా కేవలం ఆక్సిడైజ్డ్ జుంకాలు మాత్రమే పెట్టుకుంది.

**అన్ని భాషల్లోనూ అదరగొడుతున్న అమైరా:**

అమైరా దస్తూర్ కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన క్యారెక్టర్స్ చేస్తూ దూసుకుపోతోంది. క్రైమ్ డ్రామా సిరీస్ 'బంబాయి మేరి జాన్', తమిళ థ్రిల్లర్ 'బఘీరా' లలో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతేకాదు, పంజాబీ రొమాంటిక్ డ్రామా 'పుర్తీలా' తో రీజనల్ మార్కెట్‌లోనూ హిట్ కొట్టింది. నటిగానే కాకుండా తన సొంత ఫ్యాషన్ వెంచర్స్‌తో బిజినెస్ ఉమన్‌గానూ రాణిస్తోంది.

**నెట్‌ఫ్లిక్స్ 'చుంబక్' పై భారీ ఆశలు:**

ప్రస్తుతం అమైరా దస్తూర్ నెట్‌ఫ్లిక్స్ లో రాబోతున్న మోస్ట్ అవేటెడ్ మల్టీస్టారర్ కామెడీ డ్రామా 'చుంబక్' సినిమాలో నటిస్తోంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్ తో ఓటీటీలో మరో పెద్ద సక్సెస్ అందుకోవాలని చూస్తోంది. ఒకవైపు సినిమాలు చేస్తూనే, మరోవైపు ఇలాంటి లవ్లీ ఫొటోషూట్స్‌తో సోషల్ మీడియాలో తన ఫాలోయింగ్‌ను భారీగా పెంచుకుంటోంది.

అటు మోడరన్ లుక్స్, ఇటు ట్రెడిషనల్ స్టైల్.. ఏదైనా సరే అమైరా దస్తూర్ చాలా ఈజీగా క్యారీ చేయగలదని ఈ ఫొటోలతో మరోసారి ప్రూవ్ అయ్యింది. ఇక సింప్లిసిటీనే అసలైన బ్యూటీ అని నిరూపిస్తున్న ఈ లావెండర్ శారీ లుక్ ఇప్పుడున్న యంగ్ గర్ల్స్‌కు ఒక పర్ఫెక్ట్ ఫ్యాషన్ ఇన్స్పిరేషన్ అని చెప్పొచ్చు.







Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965